MNS 01 J 236

రైతు భూమి

[సాంఘిక నాటకము]

*

రచయిత:

శ్రీ బి. యస్. సూరి

*

పబ్లిషర్సు:

శ్రీ వెంకటేశ్వర గ్రంథమండలి,

హనుమాన్ పేట : : విజయవాడ - 3.

Blank Page

1 MNS 01 J 236

రైతుభూమి

[సాంఘిక నాటకము]

రచయిత:

శ్రీ బి. యస్. సూరి

పబ్లిషర్సు:

శ్రీ వెంకటేశ్వర గ్రంథమండలి,

హనుమాన్ పేట : : విజయవాడ - 2.

ద్వితీయ ముద్రణ 2 1965
1200 ప్రతులు ఏప్రియల్
మూల్యం: రు. 2-0-0

హెచ్చరిక:

నా లిఖితపూర్వకమైన అనుమతి పత్రములేనిదే యీ నాటకమును ప్రదర్శించరాదు. ఇందుకు వ్యతిరేకించి ప్రవర్తించిన ప్రతి ఒక్కరిమీద చర్యతీసుకోబడును.

ఇట్లు,
బి. యస్. సూరి
శ్రీ రాజ్యం థియేటర్సు (రిజిష్టర్డు)
గుడివాడ. (కృష్ణాజిల్లా).

ముద్రణ:
'బాలాజీ' విజయవాడ—4.

నా మాట:

ఇది నా అయిదవ రచన. యీ ద్వితీయ ముద్రణలో కొద్ది మార్పులు జరిగాయి. సహృదయులు, కళాకారులు సరిదిద్దుకొని ప్రదర్శిస్తారని నమ్ముతున్నాను.

ఈ నాటకపు కాపీరైటు హక్కులు కబళవాయి గోపాలకృష్ణమూర్తి గారికి చెంది యున్నవి. మిగతా సర్వహక్కులు నావి.

నమస్తే

భవదీయుడు.

బి. యస్. సూరి

రచయిత
శ్రీ బి. యన్. మూర్తి

వీరు గుడివాడలో 1953లో శ్రీ రాజ్యం థియేటర్స (రిజిష్టర్డు) అను నాటక సంస్థను స్థాపించి నాటినుండీ నేటివరకూ కళామతల్లికి సేవజేస్తున్నారు. వీరికి నాటకములు, నాటికలు రచించుట, ప్రదర్శించుట, నటించుటయందు అభిలాష మెండు. వీరిప్పుడు విరివిగా వందలాది ప్రదర్శనలిస్తున్న నాటకములు "అల్లూరి సీతారామరాజు", "బాలనాగమ్మ".

పబ్లిషర్

అభ్యుదయ పథంలో

నా అభివృద్ధికై ఆశీర్వదిస్తూన్న

నా పితృదేవులు

శ్రీ టి. రామయ్యసూరి గారికి

హృదయపూర్వకంగా

సమర్పిస్తున్నా.

సూరి

ఈ నాటకం ఆంధ్రాక్లబ్ (గోల్మురి) జెమ్షెడ్పూర్-3 వారు
22-1-1955 న యీవినింగ్ క్లబ్ హాలులో ప్రదర్శించి
శ్రీ బి. యన్. సూరిగారికి 'సువర్ణపుటుంగరము'
బహూకరించిన నాటి నటవర్గము :

రామయ్య : బి. సూర్యారావ్
రంగారావ్: వై. సత్యారావ్
రాజా : బి. యన్. సూరి
కుమార్ : డి. సాంబమూర్తి
వీరయ్య : రావ్
సీను : వై. కుమారస్వామి
లత : శ్రీమతి సీతాకుమారి

దర్శకత్వం: యం. యరమియ్య ♦ ఎసోసియేట్: వై.వి. రావ్
పర్యవేక్షణ : బి. యన్. సూరి
మేకప్ : యన్. వి. ఆర్. మూర్తి; నృత్యం:యన్.గోవింద్
ఆర్కెష్ట్రా: వరగోటి అండ్ పార్టీ
అధ్యక్షులు : వి. గోపాల్

శ్రీ రాజ్యం థియేటర్సు(రిజిష్టర్డు) గుడివాడవారు అర్కుడర్కు

—: ప్రదర్శిస్తున్న నటీ నటవర్గం :—

రాజా	:	బి. యస్. సూరి
రంగారావ్	:	యం. రాఘవరావ్
రామయ్య	:	టి. ఆర్. కృష్ణ
కుమార్	:	మాష్టర్ ప్రసాద్
వీరయ్య	:	రాంబాబు
సీను	:	ఎ. యల్. నారాయణ
లత	:	శ్రీమతి సీతాకుమారి

నిర్మాత దర్శకుడు:
బి. యస్. సూరి

మ్యూజిక్:
ఆర్. పి. జెమిన్యాబాబు

సెట్స్ అండ్ లైటింగ్ : యం. యస్. రావ్

శ్రీ శివా మైక్ అండ్ లైటింగ్ సర్వీస్ గుడివాడ.

పాత్రల పరిచయం

రామయ్య – రైతు.కష్టించి చెమటోడ్చి జీవించే శ్రమజీవి. వయస్సు సుమారు 40 సం॥లు.

రంగారావు – జమీందారు. చెప్పుడుమాటలకు లోబడే అమాయకుడు. వయస్సు సుమారు 45 సం॥లు.

రాజా – రంగారావు కుమారుడు. కథానాయకుడు. పట్టణంలో విద్య నేర్చుకుంటున్న సాంస్కార జీవి. వయస్సు సుమారు 22 సం॥లు.

కుమార్ – రామయ్య మేనల్లుడు, రాజాతోపాటు పట్టణంలో విద్య నేర్చుకుంటున్న పోరంబోకు.వయస్సు సుమారు 22సం

వీరయ్య – రంగారావు ఆంతరంగికుడు. వయస్సు సుమారు 30సం॥

సీను – రామయ్య పాలేరు విశ్వాస పాత్రుడు. వయస్సు సుమారు 30 సం॥లు.

లత – రామయ్య కూతురు. కథానాయకురాలు. సంస్కారజీవి. వయస్సు సుమారు 18 సం॥లు.

రైతు భూమి

1వ రంగం

[తెర లేచేసరికి తెల్లవారుజాము షుమారు 5 గంటల సమయం. కోడి కూత వినిపిస్తుంది. కుడివైపునుండి కుప్ప నూరుస్తున్న ఎడ్ల చప్పుడు, గడ్డి రాపిడి వినిపిస్తుంటుంది. పాట వినిపిస్తుండగా తెర లేస్తుంది.]

(తెరలో పాట)

రైతా! ఓ పేద రైతా!
తొలి జామునే లేచి! బక్క పేగుల తోటి
హలము చేతను బూని
పొలమునూ దున్నుకొని
రాత్రనక పగలనక కష్టించి
చెమటోడ్చెడి ఓ పేద రైతా!
తిండి తిప్పలు మాని
నీ రక్త బిందువుతో పండించినా పంటంత
ప్రభువుల పాలేనా,
అంతిమకు మిగిలేది ఆయాసమేనా!

(ఎడమవైపునుండి రామయ్య వస్తాడు.)

రామ: సీనూ ! సీనూ !

సీను : (లోపలనుంచి)వస్తున్నా బాబూ! (వస్తాడు)ఏం బాబూ?

రామ: అప్పుడే పని మొదలెట్టావే ?

సీను : జాము రేత్రికాడొచ్చి యిక్కడే బొబ్బున్నానండీ !

రామ: ఎందుకు?

సీను : అదేటి బాబూ ! కుప్ప నూర్పిడి రోజుల్లో జాగర్త గుండాలని మీరే గదండీ అన్నారు.

రామ: అందుకు రాత్రే వచ్చి యిక్కడ పడుకున్నా వన్న మాట! దొంగ లెవరైనా దోచేస్తారని భయపడు తున్నావా ?

సీను : దొంగలేంటుండే ... చూచి వోర్వలేని దొరలే దోచెయ్యగలరు. మన జాగ్రత్తలో మనం వుండటం మంచిది గాదటండీ !

రామ: ఎంత విశ్వాసంరా! నీ విశ్వాసానికి తగిన ప్రతిఫలం చూపలేకపోతున్నాను.

సీను : అదేంటండీ అలాగంటారు? క్రింద ఏడు వుప్పినికి పంటంతా దెబ్బతిన్నా నా బాకీ మీరు సుప్తాగా తీర్చినారు గదండీ!

రామ: మా లాభనష్టాలమీద మీ బ్రతుకు తెరువు లాధార పడుంటే మీ బ్రతుకులే భారమైపోతై.

సీను : అయితే బాబూ! నాకు తెలియ కడుగుతానూ... అందరు భూస్వాములూ మీలాగుంటే మేడలు మిద్దెలు కట్టగలరటండీ!

రామ: మీలాంటి కూలి కుంకల కడుపులు కొట్టి మేడలు మిద్దెలు కట్టేకంటే కడుపు మాడ్చుకొని చావటం మంచిది.

సీను : భలే బాగన్నారండీ! అందరూ యిదే మాటమీ దుంటే నూలాటి పేదోళ్లు కడుపు మాడ్చుకొని చావాల్సిన రోజు రాదుగదండీ!

రామ: పని ఎంతవరకైంది ?

సీను : ఇంకొక గంట కట్టపడితే పని పూర్తైపోతాది బాబూ! అయితే బాబూ యీ రోజు కామందుగోరు వత్తా రంటగా ?

రామ: వస్తారు! రావలసిన సమయం యిదేగా! మగతాతో పాటు బకాయి ధాన్యంకూడా భద్రంగా యిస్తే మీకు భయమూ మాకు భారమూ తీరతై, అంటు న్నారు.

సీను: మరల్లాగయితే యిప్పు డేం సేత్తారండీ?

రామ: చేసే దేమీ లేకే చేతులు ముడుచుకు కూర్చోవా ల్సొచ్చింది. రాత్రింబవళ్ళు కష్టించి పనిచేసినా ఫలితం దక్కేట్టు లేదు.

సీను : అయితే బాబూ! ఎంత బాకీ వుంటారండీ ?

రామ: క్రిందటి సంవత్సరం ఒక్క బస్తాకూడా యివ్వలేదుగా! అందుకు కాళ్ళావేళ్ళా పడి బ్రతిమలాడితే కామం దుగోరు అతికష్టంమీద అంగీకరించారు. రెండేళ్ళదీ కలిపి యీ ఏడు తప్పక జమ కడతానని మాట యిచ్చాను. మాట నిలబెట్టుకోటానికి మన ప్రయత్నం

మనం చెయ్యాలి. ఫలితం ఏమైనా సరే! పద; ప్రొద్దెక్కకముందే చెరో చెయ్యివేసి పని ముగిద్దాం. (కుడి వైపుకు వెళ్తారు)

[తెరలో సాకీ]

లక్షలు లక్షలార్జించి యిచ్చినది
మీ చెమట బిందువులతోటి
చిగురించిన బంగారు పంటే గదా!
కష్టించే దొకడు ఫలిత మార్జించే దొకడు,
ఇదేనా రైతు రాజ్యం!
ఇదేనా రైతు రాష్ట్రం!
ఇదేనా రైతు భూమి!

[ఎడమవైపునుండి 'కుమార్' ఒక చేతిలో సూట్ కేసు రెండవ చేతిలో బెడ్డింగ్, మెడలో కెమేరా, నోట్లో సిగరెట్‌తో వచ్చి, చుట్టూ పరిశీలించి, కుప్పనూర్పిడివైపు చూసి]

నాన్‌సెన్స్! మామయ్యా! హల్లో మైడియ్యర్ మామా! స్టాప్! అల్లాగే వుండాలి. (అంటూ కేమేరాతో ఒక ఫోటో తీసుకుని) నైస్‌గా వుంది. నాచురల్‌గా వుంది. నాటు సెట్టింగ్‌లా లేనేలేదు.

[రామయ్య కుప్పనూర్పిడిలో పడ్డ గడ్డిదులుపుకుంటూ వస్తాడు]

రామ: ఏరా కుమార్! ఎప్పుడొచ్చావ్!

కుమా: నాన్‌సెన్స్! సీరియస్‌గా సివిలిజేషన్‌లో మునిగిపోయావ్!

రామ: పట్నం వెళ్లినా పచ్చి ఇంగిలీషు మారలా !

కుమా: నాన్ సెన్సు అంటే... మామయ్యా... నీకు నో సెన్సు అన్నమాట.

రామ: నీ సెన్సులు గిన్సులు నా దగ్గర వుపయోగించమని కాదు నీకు చదువు నేర్పించేది.

కుమా: నాన్ సెన్స్! వెరీబాడ్ గా మాట్లాడకు మామయ్యా! నేర్పించేది నువ్వు! నేర్చుకొనేది నేను! ఎందుకు? ఎవరికోసం? టెల్ మీ మామయ్యా! సమాధానం చెప్పు మై డియ్యర్ మామయ్యా!

రామ: బాగుపడి మమ్మల్ని వుద్ధరిస్తావని మా వుద్దేశ్యం. నీ వుద్దేశ్యం మాకేం తెలుసు?

కుమా: నాన్ సెన్స్! తెలుసుకోవలసిన బాధ్యత నీకుంది. ఒక్కసారి హాయిగా వున్నప్పుడు గుండెమీద హ్యాండ్ వేసుకుని ఆలోచించుకో!

రామ: నాకా శ్రమిచ్చే బదులు నువ్వే చెప్పరాదూ?

కుమా: కేవలం ఇండియన్స్ కోసం! ఇండియన్స్ గౌరవం కోసం! ఇండియన్స్ అభివృద్ధికోసం యింగ్లీషు నేర్చుకుంటున్నాను.

రామ: సరాసరి యిక్కడికి వచ్చావేంటి?

కుమా: (బెడ్డింగ్ పెట్టెవంక ఒకసారి చూసి) కన్పిస్తుండగా యింకా అడగటం ఎందుకు? జెస్టు నౌ కమింగ్!

రామ: నువ్వొక్కడివే వచ్చావా?

కుమా నో! నో! జమిందారుగారి సన్ అంటే మిస్టర్ రాజా కూడా వచ్చాడు. వాడిని యింటికి సాగనంపి నువ్వు పొలంమీద వున్నావేమో చూసిపోదామని వచ్చాను

రామ: రాజాగారు కూడా వచ్చారన్నమాట! చదువు లెలా సాగుతున్నాయ్?

కుమా: ఆనందంగా, అద్వితీయంగా, అద్భుతంగా, అమోఘంగా... ....

రామ: సాగుతున్నయ్యా!

కుమా: అవును మామయ్యా!

రామ: పరీక్షలైనయ్యా?

కుమా: కాబట్టే సెలవలిచ్చారు. సెలవ లివ్వబట్టే సరాసరి సాగివచ్చాం.

రామ: ఎలా వ్రాశారు?

కుమా: ఎవరి విషయం?

రామ: ఎవరి విషయమో నా కెందుకు? మీ యిద్దరి విషయమే?

కుమా: నాన్ సెన్స్! మా విషయంలో యూ డోన్టు ఫియర్! అంటే... నువ్వు భయపడాల్సిన అవుసరం లేదు

రామ: ఏం?

కుమా: రాజా ఫస్టు క్లాసులో ప్యాసౌతానని ఢంకా బజాయించి చెప్పాడు. ఇహ మన విషయ మంటారా... వుంటే పేపర్లో నెంబ రుండనూవచ్చు! లేకపోతే పోనూవచ్చు!

రామ: అంటే?

కుమా: అంటే... మన పరీక్ష విషయం అనవసరం. ప్యాసైనా తప్పినా ఒకటే! ఎందు కంటావేమో? మన మొక సినిమా తియ్యటానికిసన్నాహాలు జరుపుతున్నాం!

రామ: (ఆశ్చర్యంగా) సినిమా!

కుమా: అవును మామయ్యా! త్వరలో ఆంధ్ర దేశ మంతటా అఖండ విజయం సాధించ నుంది.

రామ: సినిమా తియ్యాలంటే చాలా డబ్బు కావాలంటారు!

కుమా: వాట్ ఏ బ్లడీ మనీ! అంటే... ఏమిటి వెధవ డబ్బని. డబ్బుని మనుష్యులు సంపాయిస్తున్నారు కాని మనుష్యుల్ని డబ్బు సంపాయించటం లేదుగా! కుక్కని తంతే లక్షలు రాల్తయ్.

రామ: ఏమిటి ?

కుమా: రూపాయలు.

రామ: అయితే మొదలు పెట్టారా?

కుమా: నాన్సెన్స్! అరే, వాటే యినోసెంట్ ఫెలో, అంటే ... అమాయకుడా ... అని.

రామ: ఏం ?

కుమా: మనం తల్చుకుంటే, ఏ పని నెరవేరదూ ? (పెద్దగా) జంటిల్ మెన్ యిన్ ది ర్యాంక్ (నెమ్మదిగ) బట్ నంథిగ్ యిందీ బ్యాంక్, అంటేడాబుసరుంటే చాలు దేశాల్నయినా దోచెయ్యొచ్చు, ఆర్టిస్టులందర్ని బుక్ చేశాను, స్టూడియో సెటిల్ చేశాను. కెమేరామేన్‌కి కబురుచేశాను, అందరూ ఎగ్రీ అయ్యారు. (సందేహంగా) అందుకు ...

రామ: అందుకు?

కుమా: నాలుగు లక్షల రూపాయలు కావాలి.

రామ: (గుండెమీద చెయ్యి వేసుకని) నాలుగు లక్షలే !

కుమా: అంతే మామయ్యా, మనం తీయబోయేది జానపద పౌరాణిక సాంఘిక చిత్రం. ఇంతవరకూ యిన్ని వెరైటీస్ కలిపి ఎవ్వరూ తీయలేదు.

రామ: అయితే నన్నేం చెయ్యమంటావ్?

కుమా: నాన్‌సెన్సు, యింకా అర్థం కాలా? ఎక్కడున్నా చేబదులుగా పుచ్చుకోమంటాను

రామ: (నిట్టూర్చి) నాలుగు లక్షలు చేబదులా, అమ్మాయి పెళ్ళికి వచ్చింది అందుకు అయిదు వందలు కావాలని కాళ్ళు బలపాలు కట్టేలాగు తిరిగినా రాగి కానీ బదులిచ్చే దాతలే లేకపోయారు.

కుమా: నాన్‌సెన్సు, పెళ్లిచెయ్యటానికి అయిదు వందల రూపాయలఖర్చా!

రామ: అవును నాయనా, పెళ్ళంటే మాటలా?

కుమా: మాటలతో కాకపోతే మూటలతో అవుతుందా! నాన్‌సెన్సు అంత డబ్బెందుకు మామయ్యా, మీ అమ్మాయిని నాకేగా యిచ్చి పెళ్ళి చేసేది!

రామ: అవును,

కుమా: అయిత్తే ఒక పసుపు కొమ్మూ, తాడూ పట్టుకురా.

రామ: ఎందుకు?

కుమా: మీ అమ్మాయి మెళ్లో కట్టేస్తాడు... మీ అల్లుడు.

రామ: అంతేనా నాయనా! లోకం పోకడను బట్టి నడవాలి. పెళ్ళంటే నువ్వనుకున్నంత చులకన కాదు. పసుపు కొమ్ము, పచ్చని తాడుతో సరిపోతుందా! నలుగురు బంధువుల్ని పిలిచి అగ్ని సాక్షిగా పెళ్ళి చెయ్యాలి. వున్న ఒక్క పిల్లకైనా ముచ్చటగా పెళ్ళి చెయ్య లేని బ్రతుకెందుకు?

కుమా: సరే! నే నొక మాట చెప్తాను, అలా చెయ్యి.

రామ: ఏమిటది?

కుమా: ఏమిటంటే... నా పెళ్ళికొరకు నీకు ఐదు వందలు కావాలి, సినిమా తియ్యటానికి నాకు నాలుగు లక్షలు కావాలి. మొత్తం నాలుగు లక్షల అయిదు వందలు ఒక్కర్నే అప్పివ్వమను. యిద్దరి పనులూ నెరవేరతై. (నవ్వి) దీనినే "టూ బర్డ్సు ఎట్ ఒక్ షాట్" అంటారు. అంటే... ఒక్క దెబ్బకు రెండు పక్షులన్నమాట. (వెకిలిగా నవ్వి) ఎలాగుంది?

రామ: ఏడ్చినట్టుంది. తాను దూరటానికి సందులేదు కాని మెడ కొక డోలట. మన తాహతును బట్టి నడుచు కోవాలి.

కుమా: నాన్సెన్సు! మా అమ్మా నాన్నా చచ్చి పోయేటప్పుడు ఏమీ యిచ్చి వెళ్ళలా?

రామ: యిచ్చివెళ్తే యీ యిబ్బందెందుకూ? ([illegible])

మీ అమ్మా నాన్నా నిన్ను ఎంతో గారాబంగా పెంచారు. వాళ్ళకు ఆ సిపాస్తు లేమీ లేవు. మీ నాన్న వ్యవసాయం చేసి పొట్టకూటికి మాత్రం సంపాయించేవాడు. అకస్మాత్తుగా మీ నాన్న మలేరియా వ్యాధితో మరణించాడు. నాటినుండీ మీ అమ్మనూ నిన్నూ నేనే పోషిస్తున్నాను. మీ తండ్రి మీద దిగులుతోనే మంచం పట్టి కృంగి కృశించి క్షీణించి మీ అమ్మ నిన్ను నా చేతుల్లో పెట్టి ప్రాణాలు విడచింది. ఇంక మా సంసారం విషయం నీకు తెలియందికాదుగా! ఒకనాడు యిరవై యెకరాల భూమికి మోతుబరి రైతుని; యీనాడు నిర్జీవంగా భూమిమీద నిల్చాను.

కుమా: అంత ఆస్థి ఏం చేశావ్? ముండలకీ తాగుడుకీ తగలేశావా?

రామ: ఆ భగవంతుని దయవల్ల అలాంటి దుర్వ్యసనాలకు యింకా లోనుకాలేదు. నాలాంటి దురదృష్ట జీవికి అవికూడా వుండే బాగానే వుండేది.

కుమా: మరి ఆస్థి అంతా ఏం చేశావ్?

రామ: ఏం చేశానని చెప్పనూ! నాయనా నువ్వు నాదగ్గరకు వచ్చినప్పటినుంచీ ఎంత ఖర్చుచేశావో ఒక్కసారి ఆలోచించుకో!

కుమా: అయితే నాకే ఖర్చయ్యిందంటావ్!

రామ: అవును.

కుమా: కాదు నేను నమ్మను.

రామ: అంటే సరిపోతుందా? కొడుకైనా నువ్వే అల్లుడివైనా నువ్వే నని అడిగింది లేదనకుండా వున్న ఆస్తినంతా అమ్మి యింతవరకూ జరిపాను. ఇకముందు ఎలా జరుగుతుందో......

కుమా: అని బాధపడుతున్నావా! డోన్టు ఫియర్! అంటే ...భయం లేదు.

రామ: అని సమరిస్తే సరిపోతుందా! జమీందారు రంగా రావుగారి దయ లేకపోతే జీవించటమే కష్టం. వారి భూమి మగతాకు తీసుకుని ప్రస్తుతం కాలం గడుపు తున్నాం. ఒకానొకప్పుడు గౌరవంగా బ్రతికిన సంసారమని మనమీదుండే గౌరవంకొద్దీ ఆయన పాపకం సంపాయించుకుని యిలా జీవిస్తున్నాము.

కుమా: ఇకనుంచి ఆ బాధేం అవసరం లేదు.

రామ: అంటే అర్థం...

కుమా: కాలేదా? మనం తీయబోయే జానపద పౌరాణిక సాంఘిక చిత్రాంద్వారా బోలెడు మనీ గైన్ చేసుకోవచ్చు.

రామ: అలా లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగ మన్నట్టుంది

కుమా: అదేంటి మామయ్యా, నటీనటుల్ని కూడా బుక్ చేసేస్తే!

రామ: ఆ!

కుమా: ఏమనుకున్నావ్! హీరో సూర్యారావ్, హీరో యిన్ సీతమ్మ, విలన్ సుబ్బారావ్, కమేడియన్ ప్రసాద్ అందరూ యాక్టు చెయ్యటానికి ఎగ్రీ అయ్యారు, కాని...

రామ: కాని ?

కుమా: ఎడ్వాన్సివ్వందే లాభం లేదన్నారు.

రామ: బాగుంది

కుమా: బాగుందేమిటి! నాన్ సెన్సు, బ్రహ్మాండంగా వుండనాలి.

రామ: నీ యిష్టంవచ్చినట్లనొచ్చు నాలికమీద మాటలేగా! చాలా పొద్దెక్కింది. యింటికి పద వస్తున్నా.

కుమా: సరే త్వరగా వస్తావు కదూ! (ఎడమవైపుకు వెళ్తాడు)

రామ: (వెళ్ళే కుమార్ని చూస్తూ ఒక్క నిట్టూర్పు విడచి) ఎంత తగలేస్తే ఏం లాభం? వట్టి అమాయకుడిలా తయారయ్యాడు! ఖర్మం. (కుడివైపుకు వెళతాడు.)

(తెరలో పాటలా వినిపిస్తుంది)
"జీవా! ఖర్మను దాటగా ఎవరికి తరమా!"

[ఎడమవైపునుంచి జమీందారు రంగారావు, రాజా, వీరయ్య వస్తారు, వీళ్ళను జూచి రామయ్య కుడివైపునుంచి వస్తాడు]

రామ: నమస్కారం బాబూ!

రంగా: నమస్తే

రాజా: పనులెలా సాగుతున్నై?

రామ: తమ దయవల్ల యింతవరకూ బాగానేవున్నా. అండీ!

వీర : యీ సంవత్సరం పంటకేం, బంగారంలా పండింది. పోయిన నష్టమంతా యిందులో పూడ్చుకోవచ్చు.

రామ: ఆ భగవంతుని దయ, బాబుగారి దయ వుంటే, అలా తప్పక జరుగుతుంది. రండి కల్లం దగ్గరకు వెళదాం.

రాజా: నేను యింటికి వెళ్తాను నాన్నా!

రంగా: సరే.

[రంగారావు, రామయ్య, వీరయ్య, కుడివైపుకు వెళతారు. రాజా ఎడమవైపుకు వెళ్తుండగా, 'లత' అన్నం బుట్ట నెత్తిమీద పెట్టుకుని వస్తుంది. ఆశ్చర్యంగా ఒకర్నొకరు చూసుకుంటారు.)

రాజా: లతా...!

లత : ఆఁ...రాజా...గారు అనాలి కదూ! (అంటూనే నెత్తిమీది బుట్ట క్రింద బెడ్తుంది)

రాజా: ఎందుకూ?

లత : పట్నంలో విద్య నభ్యసిస్తున్నందుకు, గౌరవపదం పెట్టకుండా వుంటే బాగుంటుందా!

రాజా: చమత్కారం పోలా.

లత : మీలాంటి చదువుకున్నవారిముందు మా చమత్కారాలు పనిచేస్తయ్యా!

రాజా: కులాసాయేనా లతా?

లత : ఆఁ తమ దయవల్ల యింతవరకూ అలాగే వున్నాను.

పట్నం వెళ్లినోళ్ళంతా పోరంబోకు లౌతారంటారు.
మరి మీ మంచితనం పోలేదే!

రాజా: ఎవరన్నారు?

లత : ఎవరంటే ఏం? మా బావతరహా అలాగే వుందిగా!

రాజా: అసలు వాడి తరహాయే అంతగా!

లత : సెలవిప్పిస్తారా! చాలా పొద్దెక్కింది.

రాజా: నా అనుజ్ఞ దేనికి?

లత : అవసరం కాబట్టి! (వెళ్ళబోతుంది)

రాజా: లతా!

రాజా: (ఆగి) ఏం రాజా!

రాజా: ఒక విషయం అడగాలనుంది ఏమంటావ్?

లత : అభ్యంతరం మెప్పుడూ వుండదుగా!

రాజా: నువ్వు కుమార్‌ని వివాహమాడ బోతున్నావటగా!

లత : ఎవరన్నారు.

రాజా. మీ నాన్న కుమార్‌కి వుత్తరం వ్రాశాడు.

లత : ఏమని?

రాజా: యీ సెలవల్లో మీ వివాహం చేస్తానని.

లత : వ్రాసినంత మాత్రాన అన్వాదులే రాజా! నా మాట లేకుండా మా నాన్న ఏ పనీ చేయడు. చేస్తానన్నా ఒప్పుకోనుగా! లోగడ మనం చేసుకున్న ప్రమాణాలు గుర్తు లేవనుకున్నావా?

రాజా: పెద్దవాళ్ళ పట్టుదలల ముందు మన ప్రమాణాలు పని చేస్తాయా!

లత : అని, యిష్టంలేని పెళ్ళి చేసుకుని నా జీవితాన్ని నాశనం చేసుకుంటా ననుకున్నావా?

రాజా: (కుడివైపుచూచి) మా నాన్నావాళ్లూ వస్తున్నారు పు కలుస్తాను.

లత : మంచిది.

(రాజా ఎడమవైపుకు వెళతాడు. లత కుడివైపుకు వెళ్తుండగా వీరయ్య, రామయ్య, రంగారావు ఎదురొస్తారు. లత తల వంచుకొని వెళ్ళిపోతుంది)

రంగా: (వెళ్ళేలతను తదేక దీక్షతో చూస్తూ) ఎవరా పిల్ల?

రామ: నా కూతురు బాబూ!

రంగా: అరే! ఎంత పెద్దదయింది. ఇది వరకు నేను చూచి నప్పుడు మా రాజాతో కలిసి బడికి వెళ్తూ వుండేది. పెళ్ళయిందా?

రామ: ఆ ప్రయత్నంలోనే వున్నాను బాబూ!

రంగా: సరే! వెళ్లొస్తాం. ధాన్యం వీలైనంత తొందరలో ఇంటికి చేర్చండి.

రామ: మంచిది బాబూ!

(రంగారావు, వీరయ్య ఎడమవైపుకు వెళతారు. ఆ వైపే రామయ్య చూస్తుంటాడు)

లత : (తెరలోనుండి) నాన్నా ! అన్నం వడ్డించాను రండి.

రామ: ఆఁ! వస్తున్నానమ్మా. (వెళతాడు)

(లత కాళీ బుట్ట చేతితో పట్టుకుని ఆనందంగా పాడు కుంటూ వస్తుంది)

ఓహో...... ఓహోహో ......ఓహోహోహో
ఆనందమే ఆనందమే
మోదంబు గూర్చెడి ఆనందమే ||ఆ||
వచ్చారే మావారూ మావారే వచ్చారూ
నాటి బాసలు నేటితో తీరనుగా ||ఆ||
గండు కోయిలా నీ తీయని కూతలు
ముచ్చటతో నను మురిపించెనుగా ||ఆ||

(ఎడమ వైపుకు వెళుతుంది. ఆ వైపునుంచే వీరయ్య వచ్చి, కల్లం వైపు చూచి)

వీర : రామయ్యగారూ! రామయ్యగారూ!

రామ: (వచ్చి) ఏం వీరయ్యా!

వీర : బాబుగారు మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడమని చెప్పి పంపారు.

రామ: నాతోనా!

వీర : అవును.

రామ: ముఖ్యవిషయమా?

వీర : చిత్తం.

రామ: నాతో అలాంటి ముఖ్యవిషయాలు లోగడ ఎప్పుడూ మాట్లాడ వలసినంత అవసరం రాలేదే?

వీర : ఒకప్పుడు రాకపోతే ఇప్పుడు రాకూడదని ఎక్కడుంది.

రామ: అంటే ?

వీర : అహాఁ! లోగడ అవసర మొస్తేనే యిప్పుడు రావాలని ఎక్కడుంది?

రామ: సరే! ఏమిటో చెప్పరాదూ!

వీర : చెప్పటానికేముంది, ఎలా చెప్పాలో అర్థంకావటం లేదు.

రామ: చెప్పింది చెప్పటానికి చింతెందుకు.

వీర : ఏమీలేదు. బాబుగారి భార్యపోయి అయిదు ఏండ్లయిన విషయం మీకు తెలిసిందేగా.

రామ: అవును

వీర : అందుకు ఈనాటికి వివాహం చేసుకోవాలసి కల్గిందట.

రామ: యింత వృద్ధాప్యములోనా?

వీర : ఏమంత వయస్సుంటుందండీ. మొన్నిమధ్య ఏదో మాటొచ్చి మూడవ పుష్కరమో నాల్గవ పుష్కరమో దాటలేదన్నాను.

రామ: సరే! పిల్లనిచ్చేవాళ్ళు, పుచ్చుకునేవాళ్ళుండగా మధ్య మనకెందుకు. "శుభస్య శీఘ్రం" అన్నారు పెద్దలు. త్వరగా కానివ్వమను

వీర : అందుకు మీ సహకారం కావాలి.

రామ: చేతనైనంత సాయం తప్పక చేస్తాను.

వీర : మీ చేతిలో పనే లెండి!

రామ: అయితే సందేహ మెందుకు?

వీర : యిందాక మన కల్లంవద్దకు వచ్చినపుడు చూశారు.

రామ: ఎవరిని?

వీర : ఎవరైతేనేం? ఆవిడనే వివాహం చేసుకుంటాను. అందుకు మీ సానుభూతి. సహకారం అవసరం.

రామ: ఇంతకూ ఎవరో చెప్పవేం?

వీర : ఎవరో అయితే మిమ్మల్ని అర్థించడం ఎందుకు?

రామ: అంటే?

వీర : మీ వృద్ధుల హంతకు లతని జమీందారు రంగారావుగారు వివాహం చేసుకోవటానికి నిశ్చయించుకున్నారు

రామ: ఆఁ!

వీర : ఆలోచించాల్సిన పనిలేదు. కూటికిలేక మలమల మాడే మనతో పాటు మాడి చచ్చేకంటే వారిని వివాహం చేసుకుంటే జమీందారిణి అవుతుంది లక్షల లక్ష లాస్తి కాళ్ళ వద్ద తులతూగుతూ వుం

టుంది. కాబట్టి సంకోచించక సమయం మించక ముందే నీ అంగీకారం తెలియజేయ్.

రామ: వీరయ్యా! నువ్వు మనస్ఫూర్తిగానే అడుగుతున్నావా? నీకే ఒక కూతురుంటే, నా గతే నీకు పడితే ఏం చేస్తావో చెప్పు?

వీర : ఆ విషయం యిప్పుడనవసరం. అవసరమైన విషయానికి అభ్యంతరమేమిటో చెప్పరాదూ! చూస్తూ చూస్తూ, తన కుమార్తె జమీందారిణి కాబోతుంటే సంతోషించని తండ్రెవరు?

రామ: ఛీ! నీకైనా జ్ఞానం లేదూ. తిండి లేకపోతే మాడి చస్తాం; కాని వెధవడబ్బు కాశించి కన్నకూతుర్ని తీసుకుపోయి ముసలివానికి ముడిపెట్టి పసిదాని జీవితాన్ని నాశనం చెయ్యమంటావా?

వీర : కావాలని కోరి కష్టాలు తెచ్చుకుంటున్నావు.

(సీను గడ్డిమోపు ఎత్తుకుని వస్తాడు)

రామ: ఏమైనా సరే అనుకూలించటానికైనా ఇష్టపడతాను గాని నా చిట్టితల్లి జీవితం నా చేతులారా నాశనం చేయలేను.

వీర : ఆలోచించుకునే చెపుతున్నావా?

సీను : జమీందారుగారికి యింకా పెళ్ళాశ వుందేంటండీ.

రామ: లేకపోతే ఈ ప్రస్తావనే లేకపోయేది. వీరయ్యా!

ఏమైనాసరే నా చిట్టితల్లి జీవితం చేతులారా నాశనం చేయలేను.

వీర : ఆఖరిసారిగా అడుగుతున్నాను.

రామ: ఎన్నిసార్లు అడిగినా అదే నా సమాధానం.

వీర : సావధానంగా ఒకసారి ఆలోచించుకుని మరీ సమాధాన మియ్యండి.

రామ: ఆలోచించాల్సిన అవసరం ఏమీ లేదు.

వీర : రామయ్యగారూ! జమీందారు రంగారావుగారు తల్చుకున్నారంటే మగతాభూమి మాయమవుతుంది. కూటికి లేక పిల్లాజెల్లాతో "అన్నమో రామచంద్రా" అంటూ అడుక్కు తినే రోజు రాకపోతే నా పేరు వీరయ్యే కాదు

రామ: (కోపంగా) నోర్ముయ్. (అంటూ చేతిలోవున్న కర్ర పైకెత్తుతాడు వీరయ్య పారిపోతాడు.)

సీను : బాబూ! (అంటూ రామయ్య చేతిలో కర్రను పట్టుకుంటాడు పైనుండి మేఘాలు కమ్ముకొస్తాయి. ఉరుములు, మెరుపులతో గాలివాన వస్తుంది. రామయ్య, సీను ఆకాశం వంక అయోమయంగా చూస్తుంటారు

(తెరలో సాకీ)

ఓ రైతా! ఇదేనా ప్రతిఫలం
ఏడాది పొడుగునా పండించిన పంటంత
పెను తుఫాను రాపిడికి ఆహుతేనా
నీ చెమట బిందువుల ప్రతిఫలం బిదేనా
నీ రక్త ధారల కష్టార్జితం బిదేనా
అంతిమకు నీ శ్రమంతా ఆహుతేనా

(రామయ్య స్పృహతప్పి క్రింద పడతాడు. సీను 'బాబుగారూ!' అంటూ పట్టుకుంటాడు తెర పడుతుంది)

2 వ రంగం

(సమయం ఉదయం 6 గంటలు. రైతు రామయ్య యిల్లు. గోడకు సినిమా వాల్ పోష్టర్లు అంటించి వుంటయ్. ఒక ప్రక్కన విరిగిన కుర్చీ వుంటుంది. మరో ప్రక్కన పొయ్యి, దానిమీద కుండ, ఒక దండెము, పాతగుడ్డలు వేళ్లాడుతూ వుంటాయి. మధ్య నులక మంచంమీద బెడ్డింగు పరచుకుని నైట్ డ్రెస్‌తో కుమార్ నిద్రపోతూ వుంటాడు. లత ఊడుస్తూ పాటపాడుతూ వుంటుంది.)

తెల్లారిందోయ్! తెల్లారిందోయ్!
రైతన్నా లేవోయీ తెల్లారిందోయ్ ||తె||
నాగలి చేతబట్టి ఎడ్ల జంట నేకుకొని
బక్క పేగులతోటి దుక్కి దున్నంగ
రయమునా రావేలనోయీ రైతుసోదరా |తె||
కొడవలి చేతితో కోతలు కోసి
కట్టలుగ కట్టి కుప్పలుగా వేసి
బంగారు పండించు రైతు సోదరా
ఓ రైతు సోదరా! ||తె||

రామ: (లోపలినుంచి చుట్ట కాల్చుకుంటూ వచ్చి) అమ్మా!

లత : ఏం నాన్నా!

రామ: పొలం వెళ్లొస్తానమ్మా

లత : చద్దెన్నం తిని వెళ్తావా నాన్నా?

రామ: ఆకలిగా లేదమ్మా!

లత : అవును మరి. కష్టించిన వాళ్ళకు ఫలితం దక్కపోతే ఆకలెందుకు వేస్తుంది. నీకు కాలేదేం నాన్నా.

రామ: రాత్రి ప్రొద్దుపోయేవరకూ పొలంలోనే పని చేశాను. నిన్నటి వర్షానికి పంట చాలవరకు దెబ్బతిన్నదిగా. అన్నం తీసుకువస్తావుగా అమ్మా!

లత : అలాగే నాన్నా.

(రామయ్య బయటకు వెళతాడు. లత చీపురు లోన

పడేసి, చెంబులో నీళ్ళు తీసుకువచ్చి, కళ్ళాపి జల్లుతూ కుమార్ మీద చల్లి, నవ్వుతూ ప్రక్కగా నిలబడుతుంది)

కుమా: (పకపకని కలవరిస్తుంటాడు) నాన్ సెన్స్! రెయిన్ ఈజ్ కమింగ్! సెట్టింగంతా సర్వనాశనమైంది! అబ్బబ్బ! (దణ్ణం పెట్టి) ఓ మై గాడ్! ఈ అవస్థ నేను పడలేను. సినిమా తీయటమంటే ఎంతో తేలిక అనుకుంటారు. యాక్టర్, డైరెక్టర్ అండ్ రైటర్ అన్నీ ఒక్కడే అయితే, ఇక వాడి తిప్పలు అంతా ఇంతా కాదు. ఈ సెట్టింగ్సు చెబుతూ యాక్టు చేయండి. రెడీ! వన్ టూ, త్రీ, టేక్....కట్! కట్, నాన్ సెన్స్! అరె! ఆ డైలాగు అలా చెబుతావేం? కిరాయిలు మాత్రం ఖచ్చితంగా అడుగుతారూ? ఛీ! ఛీ! డైలాగ్ డెలివరీ రాని ప్రతి వెధవా యాక్టరే! ఊం! రెడీ! టేక్!

(లత నీళ్ళు బాగా కుమార్ మీద జల్లుతుంది)

కుమా: వాట్ ఏ బ్లడీ రెయిన్! కెమెరా తడిసిపోతుంది. (అంటూ గాబరాగా లేచి దుప్పటి చుట్ట చుట్టుకుని భుజాన పెట్టుకుని పరుగెత్తబోయి లతను చూసి ఆగుతాడు)

లత : (నవ్వుతూ) ఏం బావా! సినిమా ఎంతవరకు అయింది!

కుమా: (సీరియస్‌గా) లతా! ఈ బిజినెస్ విషయాల్లో ఎగ

తాళిగా మాట్లాడొద్దని అనేక పర్యాయాలు చెప్పాను.

లత : చెప్పింది బాగానే వుంది. కానీ నిద్రలోనే ఇంత బాగా దర్శకత్వం నిర్వహిస్తున్నాక్; యదార్థంగా అయితే ఇంకా ఎంత బావుంటుందో.

(గడియారం 8 గంటలు కొడుతుంది)

కుమా: యైట్‌వోక్లాక్! టూ లేట్! లతా, రాత్రి చెప్పిన పూజా పరికరాలు పట్టుకురా.

లత : ఇప్పుడెందుకు ?

కుమా: మనం తీయబోయే పిక్చర్ సక్సెస్ అయ్యేటందుకు గాను ఈ ఆరాధన దేవత లందర్నీ ఆరాధించి వారి ఆదరణ పొందాలి. (అంటూ వాల్ పేపర్లు చూపిస్తాడు)

లత : (నవ్వుతూ) నిజమైనా సిచ్చా బావా?

కుమా: షటప్!

లత: ఏ దేముడ్నో పూజచేస్తే బావుంటుంది కాని మన లాంటి యీ మనుష్యులకు పూజచేస్తే ఏం లాభం ?

కుమా: నాకా సెన్సు- చెప్పింది చేయి.

లత : చిత్తం! (లోనికి వెళుతుంది.)

కుమా: దేముడికి పూజచేస్తే అనుగ్రహిస్తాడు. వీళ్ళు అనుగ్రహించకపోతారు. వీళ్ళకి మనం చేసే పని తెలిస్తే దయతల్చి కాస్తో కూస్తో సాయంచేయటానికైనా సిద్ధపడి మన పిక్చర్లో యాక్టు చేస్తారు.

(లత నిప్పు, సాంబ్రాణి, అగ్గిపెట్టె, పళ్ళెంలో హారతి కర్పూరం, కొబ్బరికాయ తెచ్చి కుర్చీమీద పెట్టి, లోనికి వెళుతుంది. కుమార్ లేచి, మంచం ప్రక్కకు త్రోసి, సాంబ్రాణి పొగవేసి, కొబ్బరికాయ కొట్టి, కర్పూరం వెలిగించి వాల్ పోస్టరకు హారతి నిస్తూ)

ఆంధ్రుల అభిమాన తారల్లారా! ఆంధ్రులారా! ఆంధ్రుల మీదుండే అభిమానంతో నేను తీయబోయే పిక్చరుకు సహాయం చేయండి. ఇఫ్ నాట్, అలా కాక పోతె నా లైఫ్ ఒక రైఫల్‌కు గురిచేస్తాను ఆ దెబ్బతో మీకోసం శాక్రిఫైస్ చేసినట్లవుతుంది. హెల్ప్ మీ! హెల్ప్ మీ!

(అంటూ లేచి డాన్సు చేస్తూ పాట పాడతాడు)

ఆహా! ఆహా! ఆహాహా!
అయామ్ ఫస్ట్ క్లాస్ డైరెక్టర్ ||ఆహా||
కం అవుట్, కం అవుట్, మై కోచర్స్
వెరీవెల్, వెరీవెల్, మై విజిటర్స్
అయామ్ యాక్టర్, అయామ్ ఆధర్
యెవ్విరి థింగ్ అయాం
యూ ఆల్ కం, అండ్ హెల్ప్‌మీ
అప్ ఇన్ దిస్ సినీఫీల్డు! ||ఆహా||

లత : (వచ్చి చప్పట్లుకొట్టి) బాగా యాక్టు చేశావ్ బావా!

కుమా: పిక్చర్‌లో ఇంకా బ్రహ్మాండంగా యాక్టు చేస్తాను మరదలా!

లత : అందుకే భగవంతుడు మన కా యోగం లేకుండా చేశాడు.

కుమా: (ఉపన్యాసమిస్తున్నట్లుగా) చేశాడని చేతకాని చవటలాగా కూర్చోలేదుగా! "మన ప్రయత్నం మనం చేయాలి ఫలితం ఏమైనాసరే!" అన్నారు పెద్దలు. అందుకే ఆరునెల్లు ఆలస్యమైనా పిక్చర్ మాత్రం అమోఘంగా, ఆనందంగా, అద్భుతంగా తయారయి, శతదినోత్సవాలు జరుపుకుంటుంది తెలుసా? అందుకు నువ్వేమీ బాధపడొద్దు. నువ్వు బాధపడినా నేనుమాత్రం పడను. నువ్వూ నేనూ పడని పక్షంలో (ప్రేక్షకులనుచూసి) వాళ్ళుమాత్రం ఎందుకు పడతారు? కాబట్టి ఎవరూ ఏమీ బాధ పడొద్దని నా మనవి. మన స్క్రిప్టు పూర్తవటానికి ఇంకా ఒక్క సీనుంది. ఇవే అంతిమ ఘడియలు. ఆఖరి సీను అమోఘంగా వుంటేనేగాని చిత్రం రక్తి గట్టదు, అందుకే వెళ్ళి దీర్ఘంగా ఆలోచించి పూర్తి చేసుకుని మరీ వస్తాను. ఇంతటితో నేను విరమిస్తున్నాను. (అని నమస్కారం పెట్టి వెళతాడు. లత చప్పట్లుకొట్టి వెళ్ళే కుమార్‌ని చూస్తూ)

లత : రాను రాను మరీ పైత్యం ఎక్కువౌతుంది. చదవేస్తే వున్నమతి కాస్తా పోయి, సినిమాపిచ్చో డౌతున్నాడు. (అంటూ తలుపువేసి లోనికి వెళ్ళబోతుంది.

బైట తలుపు చప్పుడౌతుంది. లత ఆగి వింటుంది.)

రాజా: (బైటనుంచి) కుమార్! కుమార్!

(లత వెళ్ళి తలుపు తీస్తుంది, రాజా వస్తాడు)

లత : రాజా!

రాజా: లతా! ఎవరూ లేరా యింట్లో.

లత : లేరు, కూర్చో రాజా!

రాజా: కూర్చోటానికి రాలేదు.

లత : మరెందు కొచ్చినట్లు.

రాజా: నీతో ఒక విషయం మాట్లాడదామని.

లత : సరి మా ణావని పిల్చా వెందుకు.

రాజా: కేవలం నీకోసం వచ్చినట్లు వాళ్ళకు తెలవకుండా వుంటానికి.

లత : మంచి వుపాయమే!

రాజా: అపాయం రాకుండా వుంటానికి వుపాయం అవసరంగా!

లత : అసలు విషయం చెప్పండి.

రాజా: చెప్తాను తొందరపడితే ఎలా? మా నాన్న మీ నాన్నకు ఏమైనా కబురు చేశాడా?

లత : నాకేం తెలియదే!

రాజా: పోనీ మీ నాన్న నీ వివాహ విషయమై ఏమన్నా చెప్పాడా?

లత : ఏమీ చెప్పలేదే! ఎందుకు?

రాజా: ఏమీ లేదు, నిన్నొక లక్షాధికారి వివాహమాడ

బోతున్నాడు. ఆ శుభవార్త చెప్పివెళదామని వచ్చాను.

లత : (నవ్వుతూ) చాలా గొప్పవార్తే! ఆ విషయం నాకు లోగడే తెలుసు.

రాజా: ఏ విషయం?

లత : నన్నొక లక్షాధికారి వివాహమాడబోతున్నాడన్న విషయం.

రాజా: ఏ విధంగా?

లత : ప్రేమించి.

రాజా: కాదు; కామించి. కార్యం నెరవేర్చుకోడానికి ద్వారజన్యంగా వివాహం చేసుకోబోతున్నాడు.

లత : రాజా! ఏమిటా మాటలు. నీ గురించి నాకు నువ్వు చెప్పాల్సిన అవసరం లేదు.

రాజా: అవి నాకు తెల్సు. కాని చెప్పేవిషయం నాగురించని నువ్వెందుకు కనుక్కోవాలి.

లత : నేను నిన్ను వివాహమాడ బోతున్నాను కాబట్టి, నీ హృదయం నాకు తెల్సు కాబట్టి—

రాజా: కాని అలా జరగటంలేదు.

లత : అంటే!

రాజా: కోడలుగా కావలసినవారికిభార్యగా అవ్వబోతున్నావ్!

లత : రాజా!

రాజా: అవును. మా నాన్న నిన్ను వివాహంచేసుకుంటీరతానని ద్వారజన్యంగా మీ నాన్నకు కబురుచేశాడు.

లత : యింత అన్యాయమా?

రాజా : న్యాయాన్యాయాలు ధనికుల దౌర్జన్యాల ధాటికి ఆగుతయ్యా!

లత : న్యాయం లేదా?

రాజా : న్యాయం! ఏదీ న్యాయం! ఎక్కడుందీ న్యాయం! ధనికుల కోర్కెలు నెరవేర్చటం న్యాయం! వారు కోరింది కాదనకపోవటం న్యాయం! వారి ముచ్చట్లు తీర్చటం న్యాయం! న్యాయమట న్యాయం!

లత : అవును. వారి మాటకు ఎదురు చెప్పకపోవటమే న్యాయం! యీ విషయంలో నీ వుద్దేశ్యం ?

రాజా : సదుద్దేశ్యంతో కాకపోతే సమాధానపరచుకోవాల్సినంత అవసర మేముంది? మీ నాన్న అందుకు అంగీకరిస్తాడేమో?

లత : నా యిష్టం లేందే ఏ పనీ చెయ్యడు.

రాజా : చేయడానికి సిద్ధపడ్డా చేసుకున్న బాసలు ప్రకారం మనం నిలవటం మన ధర్మం. ఏమంటావ్?

లత : అలాగే రాజా! నా ప్రాణ ముండగా నిన్ను తప్ప యింకొకర్ని వివాహ మాడనని మళ్ళీ ప్రమాణం చేస్తున్నాను రాజా! (చేతిలో చెయ్యివేసి ప్రమాణం చేస్తుంది)

రాజా : (మీందికి లాక్కుంటూ) లతా!

లత : (అర్ధనిమీలిత నేత్రాలతో) రాజా!

(రాజా ముద్దు పెట్టుకోబోగా లత పారిపోతుంది. ఇద్దరూ డైలాగ్ పాడతారు.)

లత : ఓహోహో నా రాజా!

రాజా : ఓహోహో నా రాణీ!

లత : స్వాగతంబోయీ సుస్వాగతంబోయీ

రాజా : స్వాతంత్ర్యంబే సుస్వాగతంబానే

లత : నాటి బాసలు నేటితో తీర

రాజా : నేటి కలలు నాటి బాసలే కదా

రా॥ ల: ప్రేమ పిపాసులకు ఆదర్శంబుగ
ప్రేమ వాహినిలో నడుపుదమే
నావను నడుదపుమే
ప్రేమ రాజ్యములో పయనించెదమే
ప్రేమికులకు ఆదర్శంబై వెలయుదమే

లత : రావో నా రాజా!

రాజా : రావే నా రాణీ!
(ప్రణయ కౌగిలిలో తేలిపోతారు. బయట తలుపు శబ్దమౌతుంది.)

లత : (భయంగా ఎవరో వచ్చారు!

రాజా : భయం లేదు. నీవు లోనికి వెళ్ళు.
(లత లోపలకు వెళుతుంది. రాజా వెళ్ళి తలుపు తీస్తాడు. కుమార్ వస్తాడు.)

కుమా : హాల్లో! మై డియర్ రాజా! ఎప్పు డొచ్చావ్?

రాజా : ఇంతకు ముందే వచ్చాను. మీ మరదలు "ఇప్పుడే వస్తారు; కూర్చోండి" అన్నది. కూర్చుంటుండగానే నువ్వు తలుపు కొట్టావ్.

కుమా : ఎందు కొచ్చినట్టు?

రాజా : సరదాగా చూసి వెళ్దామని.

కుమా: (కోపంగా) అంతేనా? రాజా! నీ వింత అమాయకుడ వనుకోలేదు. నన్నే మోసం చేయటానికి తల పెడ్తావని ఎప్పుడూ వూహించలేదు. ఇంత ద్రోహం చెయ్యటానికి పూనుకుంటావా?

రాజా : (అనుమానంతో కూడిన భయంగా) కుమార్!

కుమా : నాన్‌సెన్స్! ఆంధ్ర దేశ మంతటా పయనించి ఆంధ్రుల ఆదరాభిమానాలను చూరగొంటానికి జానపద పౌరాణిక సాంఘిక చిత్రం తీస్తున్నాను. అందులో యాక్టు చేస్తానికి వచ్చావేమో ననుకున్నాను. చూసిపోవటానికి వచ్చానంటావేమిటోయ్!

రాజా : (తేరుకుని నవ్వుతూ) అదా విషయం.

కుమా: (నవ్వుతూ) మరే మనుకున్నావ్.

రాజా : ఎందాక వచ్చింది నీ పిక్చర్.

కుమా: ఆఖరి దశలో వుంది. స్క్రిప్టు లాస్టు సీను పూర్తవుతోంది దాన్లో నీవు యాక్టు చేయాలి.

రాజా : అలాగే! చాలా టై మయింది. తరువాత కలుస్తాను. (బయటకు వెళ్తాడు)

కుమా: (లోనికి చూచి) లతా! డియ్యర్ లతా! మై డియ్యర్ లతా!

లత : (వచ్చి) ఏం బావా!

కుమా : మీ ఫాదర్ మిల్లుకి వచ్చాడా?

లత : ఏమిటీ?

కుమా : ఘస్టుఫారం చదివావ్, ఆమాత్రం ఇంగ్లీషు వర్డుకే

మీనింగ్ తెలీదూ? మీ నాన్న భోజనానికి వచ్చి వెళ్ళాడా అని అడుగుతున్నాను.

లత : అడుగుతున్నారా...యింకా రాలేదని చెపుతున్నాను.

కుమా: ఏం?

లత : అన్నం పొలం పట్టుకెళ్ళాలి.

కుమా: అయితే త్వరగా వెళ్ళిరా.

లత : తమరు భోజనం కానివ్వండి.

కుమా : తమరు వడ్డించండి.

లత : సరే, తమరు సిద్ధం కండి. (వెళ్ళుంది)

కుమా : మన స్క్రిప్టు రాను రాను మరీ రసవంతంగా తయారౌతుంది. హీరోయిన్ వేషానికి ఎవరో గడ బుక్ చేద్దామనుకున్న సీతమ్మ పనికివచ్చేటట్లు లేదు. యిందులో సామాన్యమైన స్టార్ పనికిరాదు హైటు ఆరు అడుగుల ఐదంగుళాలు; వెయిటు వంద పౌన్లు; ఛెస్టు థర్టీ సిక్స్ ఇంచెస్, నీలివర్ణపు కళ్ళు, నున్నటి చెక్కిళ్లు హంస నడక, కిన్నెర కంఠము, ఓహోహో! ఏం బ్యూటిఫుల్ గా వుంటుంది!

(యింతలో రామయ్య వస్తాడు)

రామ : (బయటనుంచి వచ్చి) భోజన మయిందిరా?

కుమా: (పరధ్యాన్నంగా) భోజనాని కేమొచ్చింది గాని, ఫేస్‌లో ఫీలింగ్స్ చూపిస్తేనే కాని ఆడియన్స్ ఫీలవరు.

రామ : కుమార్! భోజన మయిందా అంటే పలక వేం?

కుమా: (గాబరాగా) ఆఁ! (చూచి) నువ్వా మామయ్యా. ఇంకా కాలేదు ఇప్పుడే సన్నాహాలు జరుగుతున్నాయ్. లత నీకోసం భోజనం పట్టుకొద్దామనుకుంటూంటే నువ్వే వచ్చావేం ?

రామ: పని పూర్తవ్వొచ్చింది నీను వున్నావుగా, అందుకే వచ్చాను. సరేగాని నేను చెప్పింది ఏమాలోచించావ్?

కుమా: ఏమిటది ?

రామ: లతను నీకిచ్చి వివాహం చేయదల్చుకున్నాను. అందుకు ని ఉద్దేశ్య మేమిటి ?

కుమా: మహారాజులా చేసుకోవచ్చు ! లతకేం ? బంగారంలాంటి పిల్ల. చెప్పింది చెప్పినట్లే చేస్తుంది బుద్ధిమంతురాలు, అందగత్తె. నిజంగా ఆవిడ అందం వర్ణించాలంటే ఏ భాషలోని మాటలూ చాలవు. ఒక్క మాటలో చెప్పాలంటే రతీ మన్మథులు గూడా ఆమె ఆమె కాలిగోరముందు సాటిరారు. కాని (నెమ్మదిగా) నేను మాత్రిం చేసుకోను.

రామ: ఏం ?

కుమా: నా కిష్టలేదు.

కుమా: నా జీవితమంతా సినీ ఫీల్డుకోసం శాక్రిఫైస్ చేయదల్చుకున్నాను. అందుకు ఒక కళాకారిణిని కోరి నా దానినిగా చేసుకోవాలనుకుంటున్నాను. అంతేగాని పెళ్ళిచేసుకుని సంసార జీవితం నేను గడపలేను.

రామ : నిన్ను ఇన్నాళ్ళు పెంచి పెద్దవాణ్ణి చేసింది ఇందుకేనా ? వున్న ఆస్తినంతా తెగనమ్మి నీకు ధారపోసి నిన్నే నమ్ముకూర్చున్నాను. చివరకు నీవు చూపె ప్రతిఫలమిదేనా ?

కుమా: డోన్టు ఫీల్! డోన్టు ఫీల్! విచారిస్తే లాభం లేదు మామయ్యా! యీ రోజునుంచీ మనిద్దరం కలసి జాయింటుగా వెదికి అందమైన వరుణ్ణి సంపాయించి అమ్మాయికి ముడిపెడ్తాం, ఏం ? ఎలా వుంది నా సలహా ?

రామ : (బాధతో కూడిన కోపంతో) కుమార్. ఆఖరిసారి చెబుతున్నాను. కాని రంగారావుకి యీనాటి కిలాటి దుర్బుద్ధి పుడ్తుందని ఏనాడూ వూహించలేదు.

కుమా: (ఆశ్చర్యంగా) ఏమిటి ?

రామ: మొన్న మన పొలం దగ్గరకు వచ్చినప్పుడు లతను చూశాడట, ఆ రోజునుంచీ ఆవిడనే వివాహం చేసుకోవాలని వుందట, చేసుకు తీరతానని దౌర్జన్యం సాగిస్తున్నాడు.

కుమా: అందుకు దౌర్జన్యం దేనికి! ఆనందంగా అంగీకరించి వివాహం చేద్దాం.

రామ: నోర్ముయ్! చిన్నప్పటినుండీ పెంచిన అభిమానమైనా లేకుండా మాట్లాడుతున్నావ్! చూస్తూ చూస్తూ నా పిల్లను ఆ ముసలాడికి కట్టబెట్టి దాని గొంతు కొయ్యమనా నీ సలహా!

కుమా: నాన్‌సెన్స్! గొంతు కొయ్యమన్నానా? వాళ్ళతో వియ్యమందటం ఎందుకైనా మంచిది, అదీగాక వాళ్ళు లక్షాధికారులు తెలుసా?

రామ: అయితే?

కుమా: లక్షాధికారిని వివాహమాడితే మన అమ్మాయి ఏమౌతుంది? లక్షాధికారిణౌతుంది! అప్పుడు నీకు పెళ్ళి ఖర్చులు కలిసివస్తై, నాకు పిక్చర్ పెట్టుబడికి సహాయం చేస్తుంది.

రామ: డబ్బుకోసం పిల్లగొంతుకోసి దానిజీవితాన్ని నాశనం చెయ్యమంటావా?

కుమా: నాన్‌సెన్స్! నాశనం చేయుట మెందుకూ! అగ్నిసాక్షిగా మేరేజ్ చేసి మొగుడు దగ్గరకు పంపే దానికి.

రామ: ఇలాంటి నీచపు బుద్ధి కలవాడివని తెలుస్తే నా ఆస్తినంతా నాశనం కాకముందే జాగ్రత్త పడేవాడిని. దుర్మార్గుడా! నీ మొహం చూడటమే నాకిష్టంలేదు. తక్షణం వెళ్ళిపో!

కుమా: ఆ మాటకోసమే చూస్తున్నాను. (గోడకున్న వాల్ పోష్టర్లు తీసి బెడ్డింగ్‌లో చుట్టుకుని చంకనెత్తుకుని) మామయ్యా! వెళ్ళొస్తాను. ఇకముందు నీ జీవితాన్ని గూర్చి ఆలోచించుకో! నాయిష్టానికి వ్యతిరేకించి నీవెలా జీవిస్తావో నేనూ చూస్తాను. గుడ్ బై! (బైటకు వెళ్తాడు)

లత : (లోనినుంచివచ్చి వెళ్లేకుమార్‌నిచూస్తూ) బావా!

రామ: ఎందుకు?

లత : చిన్నప్పటినుంచి పెంచి చేతి కక్కరకువచ్చే రోజుల్లో వెళ్ళగొట్టటం బాగుంటుందా నాన్నా!

రామ: అని యెన్నివిధాల ప్రయత్నించినా బుద్ధి మార్చలేక పోయాను. ఏం చేస్తాం? అదృష్టవంతుల్ని చెరచే వాళ్ళు, దురదృష్టవంతుల్ని బాగుచేసేవాళ్ళు లేరం టాను. అదీ నిజమేనని యీనాటికి తోస్తోంది.

లత : భోజనం చేద్దువుగాని రా నాన్నా!

రామ సరే! పదమ్మా!

(లోనికి వెళ్తుండగా తెర పడుతుంది)

3 వ రంగము

[ఉదయం షుమారు 8 గంటల సమయం. జమీందారు గారి బంగళా. డ్రాయరు, దానిమీద రేడియో, పూల కూజా, అగరొత్తులకూజా, నాలుగు పుస్తకాలు వుంటై. డ్రాయరు కిరుప్రక్కలా రెండు సోఫాలు. గోడకు కాముకత్వాన్ని రేకెత్తించే ప్రేయసీప్రియుల ఫోటోలు అలంకరించి వుంటై. రేడియోలో ఇంగ్లీషు ట్యూను వినిపిస్తుంటుంది.

రాజా సోఫాలో కూర్చుని పేపరు చూస్తుంటాడు. బయట నుంచీ వీరయ్య వస్తాడు]

వీర : బాబూ! బాబూ!

రాజా: ఏం వీరయ్యా!

వీర : బాబుగారు ఏరీ?

రాజా: లోపలున్నారు. ఎందుకు? (రేడియో ఆపుతాడు)

వీర : అం ఒక పనిమీద రామయ్యగారి దగ్గరకు పంపారు. ఆ విషయం చెప్పుదామని.

రాజా: ఈ ఏడు ధాన్యం విషయమా?

వీర : కాదు.

రాజా: బకాయి ధాన్యం ఏమైనా బాకీ వున్నాడేమిటి?

వీర : అదీ కాదు.

రాజా: మరేది?

వీర : బాబుగారు వివాహం చేసుకోబోతున్నారు.

రాజా: వివాహమా?

వీర : అవును

రాజా: ఎవర్ని?

వీర : రామయ్యమనుమరాలిని

రాజా: ఏమిటీ?

వీర : అవును లతని.

రాజా: అందుకు వాళ్ళిష్టపడ్డారా?

వీర : వాళ్ళ యిష్టాయిష్టాలతో పనేముంది "రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా?

రాజా: అయితే దౌర్జన్యంకూడా సాగిస్తున్నా రన్నమాట! ఈవిషయం ఒకరిద్దరిద్వారావిని నమ్మలేకపోయాను. కాని ఈ గదిలో మార్పు చూసేటప్పటికి నిజమని తోస్తోంది భాగవత రామాయణా లుండే టేబిల్ మీద ప్రణయాన్ని నిరూపించే ప్రముఖుల పత్రికలు, పుస్తకాలు! భగవంతుని లీలలు నిరూపించే ఫొటో లుండాల్సిన గోడమీద కాముకత్వాన్ని రేకెత్తించే ప్రేయసీ ప్రియుల ఫొటోలు! ఎంతగామారిపోయారు నాన్నగారు! ఈ విషయంలో నీ ప్రోత్సాహం లేకుండా ఆయనంత ధైర్యం చేయగలడా!

వీర : మీరలా అనుమానించి అంటారేమోనని నేను అనుకుంటూనే వున్నాను అవవలసిన మాటేదో అననే అన్నారు.

రాజా : అన్నానని ఆందోళన పడేకంటె అనకుండా చేసుకో డానికి ప్రయత్నించకూడదూ ?

వీర : నన్నేం చెయ్యమంటారు ? ఈ వయస్సులో ఆ జబ్బు పుట్టనే కూడదు. పుట్టిందా ! పుడకల్లోగాని అంత మవ్వదు

(రంగారావు లోపినుంచి "రాజా ! రాజా !")

రాజా : ఆఁ ! వస్తున్నా ! (లోనికి వెళ్తాడు)

వీర : (వెళ్తున్న రాజావంక చూస్తూ) రాని మాటేదో గానే వచ్చింది. ఈ విషయంలో యుక్త ప్రయత్నం చేసి నాలుగు డబ్బులు రాబట్టుకునే మార్గం చూడటం మంచిది. బ్రతుకు తెరువు కోసం ఏ పనైనా చెయ్యాలన్నారు పెద్దలు

(రంగారావు లోనినుంచి వస్తాడు)

వీర : నమస్కారం బాబూ !

రంగా : (కూర్చుని) ఏరా ! వెళ్ళిన పనేమైంది ?

వీర : అబ్బాయిగారికీ విషయం తెలియదా ?

రంగా : తరువాత చెప్పొచ్చని వూరుకున్నాలే! జరిగిన విషయం చెప్పు.

వీర : (గంభీరంగా) .ఛీ! నోర్మూయ్. నీకు బుద్ధుందా లేదా? నువ్వు మనిషివివా లేక పశువ్వా, రేపో మాపో చచ్చే ముసలాడికి నా పిల్లనిచ్చి దాని గొంతు కొయ్యమంటావా ? జ్ఞానం లేదూ ? మూర్ఖుడా ! (నెమ్మదిగా) అని మీదపడి కరవబోయాడు.

రంగా : (తెల్లబోయి చూస్తూ) ఆఁ! అంత నీచంగా మాటలాడాడా !

వీర : మాట్లాడటమేమిటీ ! ఆయన చేతికిందబ్రతికే వాళ్ళం. అంత తొందరపడటం మంచిది కాదని

నె త్తిన నోరు పెట్టుకుని చెప్పాను. కూడు లేకపోతే మాడిచస్తాం. కాని యీ నీచపు పని చేయ్యటానికి నాకేమాయిష్టం లేదని ఖచ్చితంగా చెప్పాను.

రంగా : (కోపంగా) దుర్మార్గుడు ! తిన్నయింటి వాసాలు లెఖ్ఖ పెట్టే రకం లాగున్నాడు. వీరయ్యా! తక్షణం వెళ్ళి వాణ్ణి మన పొలం ఖాళీ చెయ్యమను ! ఉన్న యిల్లు కూడా లేకుండా తగలబెట్టు, అన్నమో రామ చంద్రా అని వీధివీధి తిరిగి ముష్టెత్తుకు తిరిగేటట్టు చెయ్యి. వీడిఖా బెవరు అడ్డువస్తారో చూస్తాను వెళ్ళు!

వీర : చిత్తం ! క్షణంలో పని ముగించి రాస్తూ ! (బయటకు వెళ్తాడు)

రాజా : (లోనినుంచి వచ్చి వెళ్లే వీరయ్యను చూచి) వీరయ్యా (రంగారావు వంక చూచి) ఏమిటి నాన్నా యిది?

రంగా : (కోపంగా) అటూ యిటూ తిరుగుతూ ఏం ?

రాజా : ముందు వెనుక లాలోచించకుండ ఏమిటీ దుష్ప్రవర్తన ?

రంగా : నీ కలా అనిపించవచ్చు. "లోకో భిన్న రుచిః" అన్నారు పెద్దలు !

రాజా చెప్పేవి శ్రీరంగనీతులు, దూరేవి ......

రంగా : (కోపంగా) రాజా !

రాజా : ఎందుకు ?

రంగ : నోటికి హద్దూ పద్దూ వుండాలి.

రాజా : చేసే పనులకి కూడా వుంటే బాగుంటుందేమో !

రంగా : నా చేష్టలు గురించి నీ కనవసరం. నా విషయాల్లో జోక్యం కల్గించుకోవటం అంతకన్నా అనవసరం.

రాజా : మరో విషయమైతే యింత బాధపడేవాడిని కాదు.

రంగా : యీ విషయంలో ఎందుకో ?

రాజా : చెప్తాను. మొన్న మీరు రామయ్యను కబురంపిన రోజునే విని చాలా బాధపడ్డాను. కాని చెప్పలేక పోయాను యిప్పుడు చెప్పక తప్పటంలేదు. మీరు ఏ యువతిని అర్ధాంగిగా స్వీకరించదలచినారో ఆవిడనే కోడలుగా అంగీకరించక తప్పదు.

రంగా : ఏమిటీ !

రాజా : అవును నాన్నా ! ఎన్నప్పటినుంచీ చనువుగా తిరగటం వల్ల, కలసి చదువుకోటం వల్ల మా యిద్దరికీ మధ్య యీ సంబంధం ఏర్పడింది. అందు గురించి ప్రమాణాలు కూడా చేసుకున్నాము.

రంగా : ఏమని ?

రాజా : వివాహం చేసుకుంటామని.

రంగా : మీ యిష్టమేనా ?

రాజా : కాదు కాబట్టే యింతకాలం ఆగవలసి వచ్చింది. కాని యీనాడు మీరు చేసే కార్యాన్నిబట్టి నా యిష్టం అనాల్సి వస్తుంది.

రంగా : అయితే నీ యిష్టమే నంటావ్.

7)

రాజా: నాన్నా! ఆవిడకు యిష్టం లేకుండా వివాహం చేసుకుని నువ్వు సుఖపడేది లేదు. మేమిద్దరం జీవించేదీ లేదు. దయవుంచి నా యీ ఆఖరికోర్కె నెరవేర్చటానికి అంగీకరించి మా సంసారం నిలబెట్టమని ప్రార్థిస్తున్నాను.

రంగా: ఛీ! సిగ్గులేదూ! నీ తాహతుముందు వాళ్ళెంత?

రాజా: ఆ విషయం తెలుస్తే మీరీ విధంగా తొందరపడరేమో?

రంగా: నా విషయం అనవసరం.

రాజా: ఏం?

రంగా: ఏదో నాలుగైదు ఏళ్ళు కాలంగడుపుకు పోయేవాణ్ణి నేను. నాలుగు కాలాలపాటు బ్రతకాల్సిన వాడివి నువ్వు, మనిద్దరికీ పోలికే లేదూ!

రాజా: (తీవ్రంగా) అవును! మీలాంటి ఉన్నతాధికార్లు కామకోర్కెకి లొంగిపోయి, జీవితాంతంవరకూ పోషిస్తామని మోసపు మాటలు చెప్పి, దొంగ ప్రమాణాలు చేసి, ఎంతమంది పేద భారత నారీమణులకు ద్రోహం చేసి, వాళ్ళ జీవితాలు నాశనం చెయ్యటం లేదూ!

రంగా. నోర్మూయ్! నీ యిష్టం వచ్చినట్లు లెక్చరిస్తున్నావే! అందుకేగదూ యింతవరకు చదివించింది.

రాజా: చదివించింది దేనికైనా నీతిని అవినీతిని గూర్చి చర్చించటానికి ప్రతివానికి హక్కుంది.

రంగా: నీ నీతినియమాలతో నాకు పనిలేదు. నా యిష్టం వచ్చినట్లు పడివుంటూనా వుండు; లేదా నా యింట్లో ఒక్క క్షణం వుండటానికి వీలులేదు.

రాజా: అలా పడివుంటం నా సిద్ధాంతానికే విరుద్ధం.

రంగా: అయితే తక్షణం యింటోంచి వెళ్ళిపో!

రాజా: వెళ్తాను! నీ ఆస్తికోసం ఆనందాన్ని, హృదయ పూర్వకంగా ప్రేమించిన ప్రియురాల్ని నాశనం చేసుకుని నా అంతరాత్మకు విరుద్ధంగా నేను నడవ లేను. సెలవ్! (నమస్కారం బెట్టి వెళ్ళబోతాడు)

రంగా: ఆగు!

రాజా: (ఆగుతాడు)

రంగా: బాగా ఆలోచించే వెళ్తున్నావా?

రాజా: ఈ విషయంలో అంతకంటె ఆలోచించాల్సిన అవసరం లేదు.

రంగా: రాజా! నా మాట కాదని ఏ పనీ చెయ్యలేవ్! బాగా ఆలోచించుకో! (బాధగా) చిన్నతనంనుంచీ తల్లి లేకపోయినా అల్లారుముద్దుగా పాలుబోసి పెంచాను. కోరిన కోర్కెలన్నీ కాదనకుండా తీర్చాను. అందుకు యిదా ప్రతిఫలం! ప్రేమించిన ప్రియురాలి మాట కాదనలేక కన్నతండ్రి కోర్కెనే కాదనటానికి సిద్ధపడ్డావ్!

—గా: (బాధగా) నాన్నా! మీకు నా ప్రాణాన్నయినా యిస్తాను కాని ఆవిడ కిచ్చిన ప్రమాణం మరచి ఆవిడకు ద్రోహం చెయ్యలేను. దయవుంచి మీకు

కొడుకే లేడని భావించి మీ ఆస్తిలో ఆనందంగా తులతూగుతూ నిర్విచారంగా జీవించండి. నమస్తే !

(బయటకు వెళ్తాడు)

రంగా : (నిట్టూర్చి) రాజా ! (అంటూ కూర్చుంటాడు)

[తెరలో పాట]

ప్రణయమే ప్రళయమూ
ప్రేమజీవుల ప్రణయ నావ
పెను తుఫానుకి తునకలేనా
ప్రేమజీవుల ప్రణయ త్యాగ మిదేనా ॥ప్ర॥

కుమా : (తెరలో) రాజా ! రాజా ! (లోపలికి వస్తాడు)

రంగా : ఎవరూ ! (చూసి) కుమార్ ! రా నాయనా ! కూర్చో !

కుమా : (కూర్చుని) రాజు లేడాండీ ?

రంగా : లేడు. కాని చూశాండీ ప్రవర్తన ఏం బాగుండలే దోయ్ !

కుమా : ఎందుకని ?

రంగా : ఏం చెప్పను ...... మా మరదల్ని ప్రేమించాడట. ప్రమాణాలు చేసుకున్నారట, ఆమెనే వివాహమాడ తాడట !

కుమా : యీ విషయం వారి ప్రవర్తన చూసి లోగడే అనుమానించాను. నాటి అనుమానం నేటికి నిజమని నిరూపించారు సరే ! అందుకు ... ...

రంగా: వీల్లేదు, నేను జీవించి వుండగా అలా జరగటానికి వీల్లేదని ఖచ్చితంగా చెప్పాను. వెంటనే యింట్లోంచి వెళ్ళి పోయాడు.

కుమా: రాజా యింత అమాయకుడౌతాడని కలలోకూడా వూహించలేదు. అక్కను తల్లి కాబోతున్నావిడను భార్యగా భావించి ప్రయత్నించటం ఎంత పొరపాటు.

రంగా: (సిగ్గుగా నవ్వుతూ) నీ కెలా తెల్సింది?

కుమా: తెలియటమేమిటీ? మీ కబురు వినగానే మా మామయ్య నన్ను బలవంత పెడ్తున్నాడు.

రంగా: ఏమని?

కుమా: లతను తక్షణం వివాహమాడమని.

రంగా: అందుకు నువ్వేమన్నావ్?

కుమా: రంగారావుగారు లక్షాధికారి. ఆయన కోర్కెలు కాదనటం కష్టాలు కోరి తెచ్చుకున్నట్లే! ముచ్చటగా వివాహం చెయ్యటం మంచిదన్నాను.

రంగా: ఏమన్నాడు?

కుమా: ఏమంటాడనే? ఇంట్లోంచిమాత్రం మనకు స్వస్తి చెప్పాడు.

రంగా: బాగుంది! నా గురించి నీకు బహిష్కరణా!

కుమా: మీలాంటి గొప్పవార్ని కూర్చి పాటుపడటంలో నా లాంటివాడెన్నడూ వెనుకంజ వేయడు.

రంగా: ప్రస్తుతం నువ్వేం చేస్తున్నావ్?

కుమా: పరీక్ష లవ్వగానే రాజా నేనూ యింటికి వచ్చాము

...నేను మాత్రం చదువుకి స్వస్తి చెప్పటానికి నిశ్చయించుకున్నాను.

రంగా: ఏం?

కుమా: ఒక పిక్చర్ తియ్యాలనుంది. స్క్రిప్టు పూర్తయింది. జానపద పౌరాణిక సాంఘిక చిత్రం. దానికొరకు నాలుగు లక్షలు అత్యవసరమని మామయ్యకు చెప్పాను దానికోసం ప్రయత్నిస్తానన్నాడు. ఇంతలో బీగా గూర్చి నాలుగు కబుర్లూ వచ్చి ఇంట్లో వుంటానికి యిష్టంలేక తక్షణం బయటకు వచ్చేశాను.

రంగా: అయితే ప్రస్తుతం ఎక్కడ వుండటానికి నిశ్చయించుకున్నావ్?

కుమా: ఆఁ నాలాంటి బ్రహ్మచారికి నివాసాలు కూడానా! హోటల్ కూడు — మఠం నిద్ర అయితే చాలదూ?

రంగా: మేమంతా వుండగా అంత విరక్తెందుకు నాయనా!

కుమా: విరక్తి కాదండీ! నేను అనుకున్న కార్యం నెరవేరే వరకూ తదేక దీక్షతో పనిచేసి పూర్తిచేస్తేనే గాని నిద్రపోను.

రంగా: అంతవరకూ మా యింట్లోనే వుండు. మా రాజా మాదిరే చూసుకుంటా! సుఖంగా వుండు.

కుమా: (బెట్టుగా) అహాఁ ఎందుకు లెండీ! ఎందుకులెండీ!

రంగా: (బ్రతిమాలుతూ) ఫరవాలేదులే వుండు నాయనా!

కుమా: సరే! మీరింతగా కోరుతుంటే కాదనటం కూడా ఏమంత భావ్యం కాదు, సరే! వుంటాను లెండి.

రంగా: ఆఁ చూడూ! నువ్వు తీయబోయే పిక్చర్‌కి ఎంత పెట్టుబడి కావాలన్నావ్?

కుమా: ఆఁ ఎంతో ఎందుకండీ! అష్టరాల్ నాలుగు లక్షలండీ!

రంగా: నాకోసం నువ్వు తీయబోయే పిక్చర్ ప్రయత్నాలు కూడా పాడుచేసుకున్నావ్!

కుమా: దాందేముందిలెండి! మీలాంటివారిలాంటి కష్ట సమయంలో ఆదుకుంటే, అనుకున్న ప్రకారం ఆశయం నెరవేరింతరవాత, పుచ్చుకున్న దానికి నాలుగింతల లాభం వసూలు చేసి యివ్వనూ!

రంగా: లాభమే!

కుమా: ఇన్సల్టు! మరేమనుకున్నారు! ఒక్క లాభమేమిటండీ! అఖండకీర్తి నార్జించవచ్చు అదీగాక సినిమా వ్యాపారం కేవలం లాభాలకోసం పుట్టిందని లోగడ అనేకమంది అన్నారు. నేను విన్నానుకూడా! అందుకే యీ ప్రయత్నమంతాను. పిక్చర్ రిలీజయిన ఐదు మాసాల్లో గైన్ చేసుకోమూ!

రంగా: సరే! ఆవిషయమలావుంచు, ఇక మనవిషయానికి వద్దాం!

కుమా: మీ వివాహంగూర్చా!

రంగా: అవును!

కుమా: నాన్సెన్స్! అందుగురించి అంత బాధెందుకండీ!

రంగా: ఆఁ! ఏమీలేదు. అనుకున్నపని కాకపోవటమనేది నా జాతకంలోనే వ్రాయలేదు. కాని, యీ వ్యవహారం యిలా యెదురుతిరుగుతుందని కల్లోకూడా అనుకోలేదు.

కుమా: ఇప్పుడుమాత్ర మేమిలెండి! నేనుండగా ఆ విష
యంలో యేమీ ఆటంకం రానియకుండా చూస్తా
నుగా! (ఆలోచించి) అయితే నేను యీ వ్యవహారం
గూర్చి యీ రోజునుంచే శ్రద్ధ తీసుకుంటాను. అది
పూర్తవ్వగానే నా పిక్చర్ తీసుకుని సెట్సుమీదకు
వెళ్తాను.

రంగా : నాయనా! కుమార్! నాకోసం నీవింత శ్రమపడు
తున్నందుకు నా అభివందనాలర్పిస్తున్నాను. ఇలాంటి
సమయంలో కన్నకొడుక్కి లేని విశ్వాసం, ఆదరాభి
మానాలు ఆ భగవంతుడు నీ కిచ్చాడు. అందుకని
నిన్ను కన్నకొడుక్కంటే గారాబంగా, గౌరవంగా
చూచుకుంటాను. నా వ్యవహారాలన్నీ నీ చేతిలో బెడ
తాను బ్రతికినంతకాలం బ్రతకను. వున్న నాలుగు
రోజులైనా నా రాజా సుఖంగా చూస్తాడేమోనను కు
న్నాను. పాలుపోసి పెంచిన విశ్వాసం కూడా లేకుండా
సంచరించాడు. నువ్వైనా నా వ్యవహారాలన్నీ
చూస్తూ బ్రతికున్న నాలుగురోజులు సుఖంగా
విశ్రాంతి తీసుకోనియ్యి.

కుమా: మీ అనుగ్రహముండాలేకాని కావలసినపని క్షణంలో
పూర్తిచెయ్యనూ!

(బయటనుంచి వీరయ్య వస్తాడు)

రంగా : ఏం చేశావురా!

వీర : కావలసిన ప్రయత్నాలన్నీ పూర్తిచేశాను. ఈ
రాత్రికే అన్నిపనులూ నెరవేరుతై.

రంగా: నువ్వు యిహనుంచి యీ కుమార్ అధీనంలో వుండి అతనిని ఆధారంగా చేసుకుని అన్నిపనులూ సక్రమంగా నెరవేర్చు. ఆయననే మన జమీకి సర్వాధికారిగా నియమిస్తున్నాను. కావలసిన వసూళ్ళు, రావలసిన బకాయిలూ మీరే చూచుకోండి.

వీర : చిత్తం!

రంగా: నా కోర్కె మాత్రం సాధ్యమైనంత త్వరలో తీర్చారంటే సుఖంగా సంసారం చేసుకుంటాను.

కుమా: అలాగే! మీరు నిర్విచారంగా వుండండి. అన్ని పనులూ నెరవేర్చే బాధ్యత నామీద పెట్టారుగా, నేటినుంచీ బూరే చూద్దురుగాని కుమార్ శక్తిసామర్థ్యాలు.

రంగా : సరే మీ యిష్టం! (లోనికి వెళ్తాడు)

వీర : అయితే బాబూ! చదువుకోసం మీరు మళ్ళీ పట్టణం వెళ్ళరా?

కుమా: వెళ్ళాలి! బాగా చదువుకోవాలి! పెద్ద డిగ్రీ సంపాయించాలి! (నెమ్మదిగా) కాని ప్రస్తుతం వెళ్ళదల్చుకోలేదు.

వీర : ఎందుకని?

కుమా: మనం యీ వూరికి వచ్చేటప్పుడే చదువుకి స్వస్తి చెప్పి వచ్చాం. ఎందు కంటావేమో! మనం ఒక పిక్చర్ అంటే సినిమా తీయబోతున్నాం!

వీర : సినిమాయె!

8)

కుమా: అవును. అది ఒక జానపద పౌరాణిక సాంఘిక చిత్రం!

వీర : ఆఁ! చాలా పెద్ద యవ్వారమే! (అంటూ క్రింద చతికిలపడతాడు)

కుమా: మరే మనుకున్నావ్!

వీర : అయితే మీరుకూడా వేషం కడ్తారా?

కుమా: నాన్సెన్స్! యింత యిన్నోసెంట్ ఫెలోవే!

వీర : అంటే నా కర్థం కాలా!

కుమా: అర్థమైతే ఎందుకడుగుతావులే! మనం యీ విషయాన్నిగూర్చి బాగా స్టడీచేశాం!

వీర : ఏ విషయాన్నిగూర్చి?

కుమా: యీ సినిమా విషయాన్నిగూర్చి చాలా డీప్‌గా స్టడీ చేశాను.

వీర : అంటే!

కుమా: ప్రస్తుతం సినిమాలో వస్తున్నఆర్టిస్టులకు స్థానంలేదు.

వీర : అంటే!

కుమా: సినిమాలో యాక్టు చెయ్యాలంటే యాక్టర్సు మంచి చెడ్డ లాలోచించే రోజులు కావు.

వీర : అంటే!

కుమా: నాన్సెన్స్! వాట్ అంటే అంటే...! వాట్ ఏ క్రేజీ భాషా యిటీజ్! పాత్ర నిర్ణయం యాక్టర్స అనుభవంపై ఆధారపడి వుండదు.

వీర : మరి దేనిమీద ఆధారపడి వుంటుంది?

కుమా: పెట్టుబడిదారుని ప్రగల్భాలమీద.

వీర : అయితే నేనూ పెట్టుబడిపెడ్తే కథానాయకుడిపాత్ర కట్టొచ్చా?

కుమా: ఓ! మహారాజులా కట్టొచ్చు! కాదనే వెధవెవడైనా వుంటే నీ యెడంకాలి చెప్పుపెట్టి కొట్టచ్చుకూడాను.

వీర : అయితే పెట్టుబడికి డబ్బులేకుండా కథానాయకుడు వేసినోళ్ళు లేరా?

కుమా: అది యిదివరకు రోజులు. ఇప్పుడలా కాదు. ఎవడికి వాడు పెట్టుబడికి సంపాయించుకోవటం, హీరోలైపోవటం! అందుకేగా నా పిక్చర్‌లో నేనే హీరోని. మళ్ళీ మన జీవితంలో యాక్టుచేసేదుండా పెట్టేదుండా. అయినా యీ రోజుల్లో ధాన్నిచ్చేవాళ్ళెవరులే!

వీర : అయితే, బాబూ నాక్కూడా చిన్న వేషం యిప్పించండీ! ఆ బొమ్మ శాశ్వతంగా నిలుస్తుంది కదండీ! నే పోయినా నా పిల్లలవాళ్ళ జ్ఞాపకమొచ్చినప్పుడు చూసుకుంటుంటారు.

కుమా: అలాగే!

వీర : మరి. పాటలుంటయ్యాండీ?

కుమా: పాటలూ... హుం! పిక్చరంతా యిమిటేషన్ సాంగ్స్‌తో గుప్పేశాను! ముఖ్యంగా మ్యూజిక్ ముచ్చటగా వుంటుందంటే నమ్మ.

వీర : ఒక్క పాటపాడి వినిపించండి బాబూ.

కుమా: నాన్‌సెన్స్! ఒక్క పాటేంటి! నువ్వు కోరినవన్నీ వినిపిస్తాను. కనిపించిన డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ ఉషో

ధ్ఘాతం దగ్గరనుండి సంపూర్ణందాకా వినిపించని రోజుందా!

వీర : అయితే పాడండి బాబూ! ఈ పాపిష్టి కళ్ళతో ఒక్కసారి చూస్తూ వింటాను.

కుమా: (నిలబడి యాక్టు చేస్తూ) అయితే విను.

(కుమార్ పాట)

అయ్యా య్యా య్యా య్యా య్యా రావో
అమ్మ మ్మ మ్మ మ్మ మ్మా రావే
అయ్యా య్యా య్యా అమ్మ మ్మ మ్మా
అయ్యా య్యా య్యా అమ్మ మ్మ మ్మ
తధిగిణ తోం! తధిగిణ తోం! తధిగిణ తోం!
అందాల చిన్నిదానా బంగారూ వన్నెదానా
పిలుపు వినవేలా కోపమేలా చెలీ ||అం||
ఆయ్! అ అ అ అ ఆ......
ఏ దునియామే ప్రతి ఆద్మీ
ఏక్ దిన్‌కా యాక్టర్ హోనా
అరె అల్లా మై క్యాకర్నా బోలో
అందమైన లేడీకి పిక్చర్‌కి తీస్తానని
అరె పిక్చర్ రిలీజ్ అయ్యేతలీకి
అరె లోకమ్మే స్త్రీలంతా స్టార్సవ్వాలంటార్
||అరె అల్లా||

(నవ్వుతూ) ఎలావుంది.

వీర : భలే బాగుందండీ! మీరు పాడితేనే యింత బాగుంది; సినిమాలో వాళ్ళు పాడితే యింకెంత బాగుంటుందో!

కుమా: నాన్‌సెన్స్! నా పాటల నాకంటే ఎవడు బాగా పాడతాడు! నుంది ఒరిజినల్ వాయిస్ కాబట్టి ఇలా వుంది. పిక్చర్ రిలీజ్ అయింతరువాత బజార్లో యిమి టేషన్ వాయిస్సులు విని మాట్లాడు. ప్రస్తుతం తీయ బోయే పిక్చర్లో యీ పాటా, మరికొన్ని బ్యాగ్ గ్రౌండ్ సాంగ్స్ పాడేది నేనే!

వీర : (బిగ్గరగా) ఓస్! మీరేనా!

కుమా: (కోపంగా) ఏయ్!

వీర : (నెమ్మదిగా గుటకలు మింగుతూ) అయినా బాగానే వుంటై.

కుమా: సరే! జమీందారుగారికి వివాహమయ్యే మార్గ మేమిటీ!

వీర : అదే నాకూ పాలుపోవటం లేదు. (ఆలోచించి)ఆఁ అయితే ఒక పని చేద్దాం!

కుమా: ఏ పని?

వీర : బలవంతానకాళ్లూ చేతులూకట్టి తీసుకొచ్చి చేసేద్దాం.

కుమా: తీసుకొచ్చే మార్గం?

వీర : అందాకా వుపాయమే అవసరం.

కుమా: అపాయం లేకుండా అయ్యే విధమై యుండాలి. రాజా ఎక్కడకు వెళ్ళి వుంటాడు?

వీర : బహుశా రామయ్యగారి యింట్లోనే మకాం పెట్టి వుండవచ్చు

కుమా: తక్షణం నువ్వు వెళ్ళి జమీందారుగారు పిలుస్తున్నారని రామయ్యను తీసుకువచ్చి యిక్కడ వుంచి మాట్లాడుతూవుండు. యీలోపు మేమిద్దరం చాటుగా వెళ్ళి ప్రయత్నిస్తాం. మర్యాదగా వొప్పుకుంటే సరి, లేకపోతే కావలసిన కార్యం కాస్తా నెరవేరుద్దాం!

వీర : సరే! నే వెళ్ళొస్తాను. (బయటకు వెళ్తాడు)

రంగా: (లోనినుంచి వచ్చి) ప్రయత్నాలు ఎంతవరకు సాగినై?

కుమా: ప్రస్తుతం ప్రథమ ప్రయత్నం సాగిస్తున్నాం! అందుకు మీ సహాయం అవసరం!

రంగా: ఒక్క సహాయమేమిటీ ప్రాణాన్నయినా యిస్తాను.

కుమా: ఇప్పుడే రామయ్యను తీసుకు రమ్మని వీరయ్యను పంపాను వాళ్ళు వచ్చేసరికి మనం అక్కడకు వెళ్ళి యుక్తప్రయత్నం చెయ్యాలి. వలలో చిక్కిందా చిక్కే లేదు. కాకపోతే ప్రాణాలమీద ఆశవదులుకోమని వార్నింగిచ్చి మరీ వద్దాం.

రంగా: భలే వుపాయం! యింకా ఆలస్యమెందుకు-ప్రయాణానికి సిద్ధంకా!

కుమా: నాన్ సెన్స్! నేను తయారవ్వటమెందుకు? నాచురల్ గావుంటే చాలు. తమరే తయారు కావాలి. కొత్త పెళ్ళికొడుకులుగదూ!

రంగా: (సిగ్గుగా) అంతా నీ చలవేగా!

కుమా: అయితే దుస్తులు మార్చుకురండి!

రంగా: క్షణంలో వస్తాను. (లోనికి వెళ్తాడు)

కుమా: (రంగారావు వెళ్ళినవైపే చూస్తూ) ఎలాగైనా వీడి కళ్ళల్లో కారంగొట్టి మనం పిక్చర్ పూర్తిచెయ్యాలి. అప్పుడుగాని మనప్రతాపం ఆంధ్రదేశమంతటా వెల్లడి కాదు. అంతవరకూ వీడికి లోకువగా వుండటం, చేతనైన సహాయం చేయటం. అలా వుంటేనేగాని మన ప్రయత్నానికి ఆటంకం లేకుండా వుండదు. అంతవరకీ అంతర్నాటకం ఆడుతూ వుండటమే మంచిది. ఇంకా ఈ వృద్ధబాలుడు వేంచేయలేదే!

[లోనికి చూస్తుండగా తెర వ్రాలును]

4 వ రంగము

[సమయం షుమారు రాత్రి 8 గంటలవేళ. రెండవ సీను మాదిరే పరికరములు అమర్చవలెను. రాజా మంచం మీాద కూర్చుని పేపరు చూస్తూ వుంటాడు. కుర్చీమీాద ప్రమిద వెలుగుతూ వుంటుంది.]

(తెరలో పాట)

అయిపోయినదా అహర్నిశలు
అర్ధాంగి కొరకై అవస్థపడిన
ఆంధ్రుని అధోగతి యింతేనా

మేడ మిద్దెలలో కులికేటి వారికి
పూరిపాకలే ఆధార మౌనా
ప్రణయ జీవుల ప్రేమఫలం బిదేనా
ఇదే అంతిమ అవతారమా
ఇదే అంతిమ ప్రయత్నమా
ఇదే అంతిమ రాత్రా......!

లత : (లోనుంచి వచ్చి) రాజా!

రాజా ఏం లతా!

లత : అలా వున్నావేం?

రాజా : ఎలాగున్నాను?

లత : మీ మొహంలో ఏదో బాధ ఆవరిబచుకున్నట్లు కన్పిస్తోంది.

రాజా: ఏమీ లేదు. మీ నాన్నను యెందుకు పిలిపించారా ......అని

లత : ఎందుకుపిల్చినా అందుకుమాత్రం మానాన్న ఒప్పుకోడు.

రాజా: ఎందుకు?

లత : నా వివాహం గూర్చి.

రాజా: మన విషయం చెప్పావా?

లత : ఆయన ముందే అనుమానించాడు. అనుమానించాడని అన్నివిషయాలు అవగాహనయ్యే వరకూ ఆగి అవమాన పడేకంటే ముందు జాగ్రత్త మంచిదని చెప్పేశాను.

రాజా: ఏమన్నాడు?

లత : వాళ్ళు చినిగిన చొక్కా ఖరీదు చెయ్యని మనం వాళ్ళతో వియ్యమందటం మంచిదికాదని, ధనవంతులతో బాంధవ్యం కూడదని అనేకవిధాల చెప్పాడు.

రాజా: అందుకు నువ్వేం చెప్పావ్?

లత : అందరిలాంటి వాడు కాడు నా రాజా అని, చిన్ననాడే ప్రమాణాలు చేసుకున్నామని నీకూతురు నీకు దక్కాలంటే యీ వివాహానికి ఒప్పుకోమని కాళ్ళావేళ్ళాబడి బ్రతిమలాడాను. కాని...

రాజా: (ఆదుర్దాగా) కాని?

లత : (గంభీరంగా) "నా యిష్టానికి వ్యతిరేకించి నీకు మనస్ఫూర్తిగా తోచిన పని చేశావ్! చిన్నప్పటినుంచీ తల్లిలేని బిడ్డవని ఎంతో గారాబంగా ప్రాణంతో సమానంగా చూచుకున్నాను. అందుకు నీ యిష్టం లేని పెళ్ళిచేసి నీ జీవితం నాశనం చెయ్యలేను (నెమ్మదిగా) అందుకు మీ వివాహానికి అంగీకరిస్తున్నాను" అన్నాడు.

రాజా: (సంతోషంగా) లతా!

లత : రాజా! (సంతోషంతో వుప్పొంగిపోతూ పాట పాడుతుంది)

(లత పాట)

రావో రాజా రావోయి నా రాజా
రావోయి రయమునా నా హృదయ రాజా

వలపంతా పొంగి పొరలే
మనసెంతో ముద మొందే ||రా||
ముచ్చట గొలిపెడి ముద్దు మోముతో
ముద్దు లొలికెడి పలుకు లొలుకుచూ ||రా||
నేటితో తీరెనుగా నా మది కోర్కెలు
మోదంబు గూర్చెడి మదిలో రాజా ||రా||
శయ్యా గృహంబుకు నిద్రింపగను
జాగు సేయక వేగమే రావోయీ ||రా||

(పాడుతూ లోనికి వెళ్తుంది)

రాజా: లతా!

లత : (లోపలినుంచి) ఆఁ! వస్తున్నా! (వచ్చి) ఏం రాజా!

రాజా: మీ నాన్న వెళ్ళి చాలా ఆలస్యమైంది. యింకా రాలేదు. ఏం జరిగిందో?

లత : ఏం జరుగుతుంది?

రాజా: ఏమన్నా ప్రమాదం జరిగిందేమోనని బాధగావుంది. నేనిప్పుడే వెళ్ళి చూసివస్తాను.

లత : త్వరగా రావాలిసుమా!

రాజా: అలాగే!

(బయటకు వెళ్తాడు. తలుపు వేసి లత లోనికి వెళ్ళి పడుకుంటుంది. అయిదు నిముషాలు గడిచిం తర్వాత తలుపు చప్పుడౌతుంది.)

రంగా: (బయటనుంచి) లతా! లతా!

లత : (లోపలనుంచి) ఆఁ వస్తున్నా. (వెళ్ళి తలుపుతీసి చూడకుండానే సంతోషంగా మాట్లాడుతూ లోనికి వెళ్తుంది)

రంగా: (వెనకాలే నడుస్తుంటాడు)

లత : యింతాలస్యమైందేం నాన్నా! ఇంకా రాలేదేమా అని నా రాజాను పంపాను నాన్నా! జమీందారు గారు ఎందుకు కబురుచేశారు? ఏం జరిగింది? మాటాడవేం నాన్నా! (అంటూ వెనక్కి తిరిగిచూచి భయంతో) ఆఁ! మి... మి... మీరా!

రంగా: అవును. భయంలేదులే!

లత : (గాబరాగా) ఎందుకొచ్చారు?

రంగా: గాబరా ఎందుకూ? మీ నాన్న లేడూ?

లత : మీ యింటికే వచ్చాడుగా!

రంగా: మా యింటికి వచ్చాడా!

లత : మీరు కబురు పంపలేదా?

రంగా: తీరిక లేక రాలేదేమోనని నేనే వచ్చాను.

లత : మీ యింటికే వెళ్ళాడు. మీకోసం ఎదురుచూస్తుంటాడు, వెళ్ళండి.

రంగా: వెళ్తాను నిన్నొక విషయం అడగాలనుంది.

లత : తరువాత అడుగుదురుగాని మా నాన్న వున్నప్పుడు రండి. ఇంట్లో ఎవ్వరూ లేరు. ఎవరైనాచూస్తే ఏమనుకుంటారు?

రంగా: అవసరమైన విషయాలేవో మాట్లాడుకుంటున్నారను కుంటారు?

లత : మా నాన్న లేందే నేనే విషయమూ మాట్లాడలేను. తరువాత రండి.

రంగా: ఆవూ దూడా వుండగా మధ్య గుంజ అరిచిందట. నువ్వూ నేనూ వుండగా మధ్య మీ నాన్న ఎందుకు? ఏమంటావ్?

లత : ఏమిటీ అనేది.

రంగా: నా కోర్కె నెరవేర్చావంటే క్షణంలో లక్షాధికారిణిని చేస్తాను

లత : మీ కోర్కెలు నెరవేర్చడానికి నేనేం మీ వుంపుడుగత్తెను కాను, చేసుకున్న భార్య నంతకన్నా కాను. దయవుంచి దయచెయ్యండి.

రంగా: తొందరపడుతున్నావ్!

లత : ఇలాంటి విషయాల్లో తొందరపడ్డా తప్పులేదు.

రంగా: (చిరునవ్వు నవ్వి దగ్గరకు వెళ్ళూ) పిచ్చిపిల్ల! అనుభవం తక్కువ.

లత : ఏమిటీ పెంకితనం. యింట్లో ఎవ్వరూ లేకుండా చూసి?

రంగా : యిలాంటి పనులకు ఒంటరితనమే అవసరం కాబట్టి. (నవ్వి) అమాయకురాలు! ఎందుకలా భయపడతావ్! రా! రా!

లత : ఎక్కడికీ?

రంగా: (నవ్వుతూ చెయ్యి పట్టుకుని) ఇంకెక్కడికి! నా కోర్కె నెరవేర్చటానికి.

లత : నా చెయ్యి వదలండి. (విదలించుకుని) మర్యాదగా బయటకు వెళ్ళమని మరోసారి మనవిచేసుకుంటున్నాను.

రంగా: నువ్వు లక్షసార్లు చెప్పినా, కావలసిన కార్యం కాందే కాలు కదపట మనేది కామందుల జీవితానికే కళంకం!

లత : (విచారంగా) కావలసిన కార్యం కాకపోవటం మీకవమానమని నా యావజ్జీవితాన్ని నాశనం చేస్తారా? ('కుమార్' ఎవ్వరూ చూడకుండా వచ్చి ఒకమూల కూర్చుని చూస్తుంటాడు)

రంగా: నాశనం చెయ్యటమా! కాదు నా యావజ్జీవితాన్ని నీకు ధారపోస్తాను. రా! నా కోర్కె నెరవేర్చు (అంటూ చెయ్యి పట్టుకుని మీదికి లాక్కుంటాడు)

లత : అబ్బ! వదులు! వదులు! నీచుడా! నీకు బుద్ధుందా, లేదా?

రంగా: (విషపునవ్వు నవ్వి) కాలుజారితే తీసుకోగలం కాని మాటజారితే తీసుకోలేం సుమా! సావధానంగా ఆలోచించుకుందువుగాని, పనులుమాత్రం సక్రమంగా నెరవేరనియ్! ఊఁ! రా! రా!

లత : అబ్బ! వదలమని చెప్తుంటే నీకు బుద్ధుందా లేదా!

(అంటూ చెయ్యి విదలించుకుని లెంపమీద తపీమని కొడుతుంది)

కుమా: (నెమ్మదిగా) అబ్బ! (లెంప సవరించుకుంటూ) ఇక సల్లు.

రంగా: (లెంప సవరించుకుంటూ నవ్వుతూ) ఎంతఆనందంగా వుంది! నీ లేత హస్తం తాకితేనే యింత అందంగా వుంది, మరి ఆ హృదయం తాకితే యింకెంత ఆనందంగా వుంటుందో!

లత : సిగ్గులేదూ! ఎన్నిసార్లు చెప్పాలి! మర్యాదగా బైటికి నడవండి!

రంగా: (గంభీరంగా) అదే చెప్తుంటే మరీ నెత్తికెక్కుతున్నావ్! మీరు ఎవరివల్ల జీవిస్తున్నారో ఒక్కసారి ఆలోచించండి.

లత : ధనానికి పేదైనంతమాత్రాన గుణానికి కాదుగా!

రంగా: (నవ్వి) పిచ్చిపిచ్చి కార్యాలతో కాలం వెళ్ళబుచ్చక కావలసినకార్యం కానివ్వుముందు! (అంటూ దగ్గరకు వెళ్తుంటాడు)

లత : (ఏడుస్తూ) ఏమండీ మీకు నాలాంటి కూతుళ్ళు లేరూ! రేపెవరైనా ఆమెను యిలా చేస్తుంటే మీరు సహిస్తారా! కన్న కూతురు కాదుగదా అని కామకన్ను - ర్తికి కళ్ళు మూసుకుపోయి......

రంగా: నోర్మూయ్!

రాజా: (బయటనుంచివచ్చి వాతావరణంపరికించి) నాన్నా!

లత : రాజా! (ఆనంద బాష్పాలు విడచి లోనికి వెళ్తుంది)

కుమా: (ఎవ్వరూ చూడకుండా జారుకుంటాడు)

రంగా: ను...ను...నువ్వా!

రాజా: అవును. నేనే!

రంగా: ఇప్పుడెందుకొచ్చావ్?

రాజా: తమరు చేసేపని చూసి ఆనందించటానికి.

రంగా: చూశావుగా! ఇహ దయచెయ్.

రాజా: ఆపనే చెయ్యమని నా చేతనిపించుకోవటం యేమంత సమంజసంగా వుండదేమో?

రంగా: ఆవిషయం తెలిస్తే యిలాంటి సమయంలో రానే రావు.

రాజా: నాన్నా! యింతవరకూ సహించాను కాబట్టి మీ ఆటలు సాగినయ్! తన అర్ధాంగి శీలాన్ని చెరచటానికి ప్రయత్నిస్తుంటే హృదయమున్న మానవుడెవ్వడూ సహించలేడు.

రంగా: అర్ధాంగా...!

రాజా: అవును. ఆవిషయం మీకు లోగడే చెప్పాను. తెల్సికూడా తప్పుదుత్రోవ తొక్కుతున్నారు.

రంగా: దిగితేనేకాని లోతు తెలియదు. ఏ పుట్టలో యే పాముందో యెవరు చెప్పగలరూ? మన ప్రయత్నం మనం చెయ్యాలి, ఫలితం యేమైనాసరే.

రాజా: (హేళనగా) ఫలితం పొందేరుగా, పలాయనం చిత్తగించండి.

రంగా: అలాగే! ఇంత పొగరు పనికిరాదు. ఇకముందు మీకు రాబోయే అపాయాల్ని గురించి జాగ్రత్తగా మసులుకోండి. లేకపోతే మీ ప్రాణాలు దక్కవ్! (అంటూ బయటకు వెళ్తాడు. అటునుంచే సీను వస్తాడు)

సీను : శాబూ! అయ్యగోరున్నారుండీ.

రాజా: లేరు సీనూ.

సీను : ఎక్కడికి శెళ్ళారుండీ.

రాజా: జమీందారుగారు కబురంపితే వెళ్ళారు

సీను : మరి అయ్యగోరు యిక్కడికే వచ్చారుగదండీ !

రాజా: అదే అర్థం కావటం లేదు. ఎందుకు పిలిపించారో యేమో, చాలాసేపయింది. వెళ్ళి చూసిరా. నాకేమిటో అర్థంకావటం లేదు.

సీను : సరే, వెళ్తొస్తానండీ. (వెళ్తాడు)

లత : (యేడుస్తూ తలవంచుకుని ప్రక్కనే నిలబడుతుంది.)

రాజా: లతా.

లత : (తలెత్తి చూస్తుంది)

రాజా: (దగ్గరకు వెళ్ళి) ఎందుకు కన్నీరు కార్చటం?

లత : (కంటనీరు తుడుచుకుంటూ) ఏమీలేదు.

రాజా: కారణం లేకుండా కన్నీరు కార్చొచ్చా?

లత : కళ్ళతో చూసికూడా కారణం లేదంటారెందుకు?

రాజా: మామగారేగా! కోడలి గుణం కనిపెట్టటానికి ప్రయత్నించి వుంటారు.

లత : ఆ వుద్దేశ్యంతోనైతే యింత బాధ పడేదాన్ని కానే కాదు.

రాజా: ఆయన దురుద్దేశ్యంతో చేయబోయినా మనం సదుద్దేశ్యంతోనే సమర్థించుకోవటం సమంజసం.

లత : ఎందుకని ?

రాజా: పెద్దవాడు, కన్న తండ్రి, తమకు కాబోయే మామగారు.

రాజా: లేకపోతే ?

లత : ఏంజరగాలో అదే జరిగేది.

(రామయ్య, సీను వస్తారు)

రామ: జరగాల్సిందేదో జరగనే జరిగింది.

లత : ఏంజరిగింది ?

సీను : ఏం జరుగుతుందండీ ! నారు చేయగల్గిందోక్కటే నా!

రాజా: మగతాకిచ్చిన భూమి వసలుకోమంటారు. అదేగా?

రామ: అధికారులు అంతకంటే చేయగల్గిందేముంది ?

(అంటూ మంచంమీద కూర్చుంటాడు)

లత : ఇంక మనం జీవించటం ?

రాజా: కష్టించేవాళ్ళకి జీవించే మార్గాలే లేవా ?

లత : అయితే ఏ కూలో నాలో చేసుకు జీవించాలన్న మాట.

సీను : మీకెందుకండి ఆ బాధ. నా ప్రాణముండగా మీకా శ్రమ అక్కర్లేదు.

లత : అంతే!

రాజా: మనం జమిందార్లలాగా కూర్చోవాలి, అతను సంపాయించి పోస్తాడు!

రాము: పెట్టుకున్న విశ్వాసం కూడా లేకపోయిందా జమిందారుకి. పది సంవత్సరాలనుండీ బంగారంలా చూసుకుంటున్న భూమిని క్షణంలో ఖాళీ చెయ్యమన్నాడు.

లత : మరి యీ సంవత్సరం పంట......

రాము: లోగడ బకాయి ధాన్యం క్రింద జమకట్టుకుని ధాన్యమంతా యింటికి తోలించుకోటానికి సన్నాహాలు జరుపుతున్నాడు.

రాజా: ఎలాంటి తండ్రి యెలా తయారయ్యాడు? ఇదంతా ప్రక్కనున్న వీరయ్యగాడు ఆడిస్తున్న నాటకం. వీడికి తోడు ఆ కుమార్ కూడా చేరేడట.

లత : ఆ మా బావ జమిందారుగారింట్లో వున్నాడా ?

సీను : వాళ్ళిద్దరే కదండి జమిందారుగార్ని కీలుబొమ్మలా ఆడించేట్టు ఆడిస్తున్నారు.

రాజా: అయినా ఒకసారి వెళ్ళి ప్రయత్నిస్తాను.

రాము: ఎందుకు నాయనా, వృధా ప్రయాస తప్ప మరేం లేదు.

లత : అని వూరుకుంటే, కాలం గడిచే దెలా ?

రాము: ఏ కూలో చేసుకుని బ్రతకలేక పోతేగా! కష్టించే రైతుకి బ్రతకటానికి స్థానమే లేదా ?

రాజా: నేను కూడా రేపు పట్టణం వెళ్ళి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాను.

(12 గంటలు వినిపిస్తై)

సీను : అబ్బా! సగం రాత్రయ్యిందండీ !

రాము: సరే! వెళ్ళి పడుకుని తెల్లారి రా సీనూ.

సీను : అలాగేనండీ. (వెళతాడు)

రాము: (లేచి లోనికి వెళ్తూ) సరే మనం వెళ్లి పడుకుందాం

(లోనికి వెళతారు. రంగస్థలంమీద లైట్లన్నీ ఆరి పోతై. ఒకటి రెండు గంటలు వినిపిస్తుంది. నల్ల ముసుగులతో వీరయ్య, కుమార్, చేతిలో కాగడాలతో ప్రవేశించి, రంగస్థలమంతా పరికించి లోనికి వెళతారు. కొద్ది క్షణాల వ్యవధి తరువాత లోనుంచి ఇల్లు తగలబడుతున్నట్లు పెద్ద పెద్ద మంటలు కన్పిస్తై. ఆ మంటల్లోంచి వీరయ్యా, కుమార్‌లు పారిపోతారు. ఇల్లు తగలబడుతున్నట్లు అలజడి విన్పిస్తూంటుంది. రాజా అతని చేయిపట్టుకుని లాక్కుంటూ పరుగెత్తి వస్తాడు. లత నాన్నా అంటూ ఏడుస్తూంటుంది లోనినుంచి పాట విన్పిస్తూంటుంది)

(తెరలో పాట)

అయ్యయ్యో, అగ్ని దేవుడా,
అనాథలకు ఆహుతే ప్రతిఫలమా
శ్రమజీవులకు నిరాశయే ప్రతిఫలమా
ఇదేనా రైతురాజ్యం
ఇదేనా రైతు రాష్ట్రం
ఇదేనా రైతు భూమి.

లత : (ఏడుస్తూ) రాజా, నాన్న ఆ మంటల్లో కాలిపోతున్నాడు నాన్నా, నాన్నా,

రాజా: నువ్విక్కడే వుండు నేను తీసుకువస్తాను. (మంటల్లోకి దూకి వెళతాడు.)

లత : ఏడుస్తూ) నాన్నా, నాన్నా, రాజా.

(మంటలు బాగా ప్రజ్వరిల్లుతూంటయ్. రాజా వొళ్ళంతా యిల్లు కాలిన మసితోనూ, నీళ్లతోనూ మలినమై ముఖంమీద నుంచి, చేతిమీదనుంచి రక్తం కారుతూంటుంది. రామయ్య వళ్లంతా వుడికిపోయి వుంటుంది. రాజా రామయ్యను రెండుచేతుల్లోకి యెత్తుకుని వస్తూంటాడు. ఈ దృశ్యం చూచి లత నిర్ఘాంతపోయి 'నాన్నా, నాన్నా,' అని యేడుస్తూంటుంది. రాజా రామయ్యను క్రింద పడుకో పెడతాడు. లత చీరెను చించి కట్లు కడుతూ యేడుస్తూంటుంది. రాజా అయోమయంగా మంటల వంక చూస్తూంటాడు సీత బయటనుండి ఆతుర్దాగా పరుగెత్తి వస్తాడు)

సీత : (బాధగా) బాబుగారూ! కలవాళ్ళు లేనివాళ్ళమీద సాధించి సాగించే దౌర్జన్యం యిదేగదండీ.

రాజా: ఇంతకు తెగించినవాడు యింకేతయినా చెయ్యగలడు.

సీత : మీ తండ్రిగారే కదండీ.

రాజా: కాబట్టే యిన్నాళ్ళు సహించాల్సొచ్చింది.

లత : కాము కక్కుర్తితో కూలివాళ్ళ కంట్లో కారం గొట్టటమే ఆయనకు ధర్మం కాబోలు.

రాజా: ధర్మం! ఏదీ ధర్మం! అధికారుల అడుగులకు మడుగు లొత్తటం ధర్మం! వాళ్ళు కాని కార్యాన్ని చేయటానికి పూనుకున్నా సహించి వూరుకోవటం ధర్మం! ధర్మమట ధర్మం!

(రామయ్య ఆయాసంతో బాధపడ్తుంటాడు. ఆయాసం దగ్గు అధికమౌతై. అంతా వచ్చి చుట్టూ కూర్చుంటారు.)

రామ: (ఆయాసంతో బాధపడుతూ) నాయనా! ఐపోయిన దాన్ని గురించి యింకా బాధపడి ఏం లాభం! నా ఆయుస్సు యింతటితో తీరిపోయింది. అంతేకాని ఆయన్ను అని ఏం లాభం! ఇంతకంటే నాజీవితానికి శుభసమయ మేముందీ! (లత, రాజా చేతులు కలిపి సంతోషంగా) తల్లి లేకపోయినా లతను ఎంతో గారాబంగా పెంచాను. ఈనాడు నీ చేతుల్లో పెడుతున్నాను. ఇకనుంచి ఆ బాధ్యత నీమీద పెడుతున్నాను.

రాజా: అలాగేనండీ! నా ప్రాణముండగా ఆవిడకు ఏలోటు రానివ్వను.

రామ: అబ్బ! ఎంత ఆనందంగా వుందీ! (అందరివంకా అయోమయంగా చూస్తూ) లతా! రాజా! సీనూ! (దగ్గూ ఆయాసం ఎక్కువౌతై. ఆ శ్రమజీవి కళ్ళు మూస్తాడు.) ప్రక్కనున్న మంటలుకూడా నిరసిస్తై.

లత : (ఏడుస్తూ మీదపడి) నాన్నా! నాన్నా! నాన్నా!

రాజా: మామయ్యా! (రెండు కన్నీటిబిందువులు రాలుస్తాడు)

సీను : బాబుగోరూ ! కష్టించి పనిచేసే మీలాంటోరికే

యిలాంటి అన్యాయం జరుగుతూంటే యింకా మేం ప్రాణాలతో వుండిమాత్రం ఎందుకండీ.

రాజా: (లేచి నిలబడి) అని ప్రాణాలు తీసుకుంటే యేం లాభం ! ఆ ధనికుల యినుపపాదాలక్రింద కష్టజీవులంతా యిలాగే నలిగి నశించి కృంగి కృశించి క్షీణించిపోవాల్సిందేనా? అలా జరగటానికి వీల్లేదు. ఇకముందైనా రైతులంతా యేకం కావాలి. ధనికుల దౌర్జన్యాలకు తాళం వేయక మన ఆశయాలు నెరవేర్చుకోనేటట్లు ప్రయత్నించాలి. అందుకు "దున్నేవాడిదే భూమి" అనే సిద్ధాంతంమీద అంతా నిలుద్దాం. 'చెమటోడ్చి పనిచేసే రైతుదే భూమి' అని ఢంకా బజాయించి చెపుదాం! రామయ్య ఆత్మశాంతికి మనమంతా యీరోజునుంచీ ఆ ఆశయం మీద నిలుద్దాం ! అది నెరవేరే వరకూ నిద్రపోనని శపథం చేస్తున్నాను.

లత : (లేచి) నా తండ్రి ప్రాణాలు బలిగొన్న ఆ జమీందార్ దౌర్జన్యం నేలగూలేవరకూ నేనూ నిద్రపోను.

సీను : మీతోపాటు నేనూ! అంతా కలసి జమీందారుగారి మీద దాడిచేద్దాం పదండీ! (వెళ్ళబోతాడు)

రాజా: ఆగండి. ముందు మర్యాదగా మన ఆశయాలు నెరవేర్చమని కోరదాం!

లత : ఇంకా మర్యాదేమిటి రాజా! వుండటానికి యిల్లు, తినటానికి తిండి. కడకు కన్నతండ్రిని కూడా దూరం చేశాడు

సీను : మన పనులన్నీ నెరవేరేవరకూ మా యింటికాడుందాం పదండి !

రాజా: ఆ జమిందారు దౌర్జన్యం అణగాలంటే ప్రక్క విష జంతువుల కోరలు పీకాలి.

లత : వాళ్ళెవరు ?

సీను : ఇంకెవరున్నారండీ ! మీ బావా, ఆ యీరిగాడున్నూ !

రాజా: పదండి, రైతులందర్నీ యేకం చేసి మన ఆశయాలు చెప్పి వప్పించి జమిందారు యింటిమీద దాడిచేద్దాం పదండి ! రైతు భూమికీ... ... ...

అందరూ : జై !

(అందరూ వరుసగా నిలబడి కోరస్ సాంగ్ పాడుతూ లోనికి వెళ్తారు)

(కోరస్ సాంగ్)

పదండిరా పదండిరా
పదండి పదండి పదండిరా ॥ప॥
రైతు రాజ్యమే ప్రజా రాజ్యమని
ప్రజా సేవయే రైతు రాష్ట్రమని
విజయ భేరీ మ్రోగించుటకై ॥ప॥
ధనికుల దౌష్ట్యం దగ్ధం సేయగ
పేదల పాట్లు రూపుమాపగా
అఖండ విజయం సాధించుటకై ॥ప॥

[తెర]

5వ రంగము

[సమయం ఉదయం షుమారు 8 గం॥లు. జమీందారు గారి బంగళా. మూడవ సీను నూదిరే పరికరములు అమర్చ వలెను. కుమార్ సోఫాలో పడుకుని పత్రిక చదువుకుంటుం టాడు. వీరయ్య వస్తాడు.]

వీర : నమస్కారం బాబూ !

కుమా: నమస్తే !

వీర : బాబుగారు లేవలేదా అండీ ?

కుమా: లేచారు, కాఫీ తాగుతున్నారు.

వీర : రాత్రి విషయం వూరంతా పాక్కిపోయిందండీ !

కుమా: ఇల్లు తగలబడితే తెలియకుండా వుంటుందా ?

వీర : అది కాదు.

కుమా: మరేది ?

వీర : ఆ పని మనిద్దరి ప్రోత్సాహంవల్లే బాబుగారు చేయిం చారని, మన చేతులమీదే జరిగిందని, వూరంతా కోడై కూస్తోంది.

(రంగారావు వచ్చి కూర్చుంటాడు)

వీర : నమస్కారం బాబూ !

రంగ : అనుకున్న పని పూర్తయ్యింది.

కుమా: అప్పుడేనా ! ప్రథమ ప్రయత్నం అయిందీ... అనాలి.

వీర : పిట్ట చేతులో బడందే అనుకున్న ప్రయత్నం అయిం
దని యెలా చెప్పగలం ?

రంగా: మకాం ఎక్కడ పెట్టివుంటార్లో ?

కుమా: ఇంకెక్కడ వీలుంటుంది... ఆ సీనుగాడు లేడూ...
వాడింట్లో పెట్టివుంటాడు.

రంగా: ఇప్పటికైనా రామయ్య ఒప్పుకుంటాడా ?

వీర : రామయ్యా... యింకెక్కడి రామయ్య...

రంగా: ఏం ?

వీర : ఆ మంటల్లో మాడి చచ్చాడు

కుమా: నాన్ సెన్స్ ! నాకు నాలుగు లక్షలూ, మీకు
పిల్లనీ, యిస్తే నిర్మలంగా పోయేవాడు. ఇంత కఠి
నపు చావుకి గురికావాల్సివచ్చేది కాదు.

రంగా: (నవ్వుతూ) బాగా అన్నావ్ ! లేకపోతే అంత
పొగరా ? ముష్టి వెధవ ! ముచ్చటగా ఒప్పుకుంటే
ముక్కోటి దేవతల్ని దాసోహం చేయించేవాణ్ణి.

వీర : మంచిగా చెప్తే విన్నాడా ?

కుమా: అందుకే తగిన శాస్తి జరిగిందిగా !

రంగా: ఆ యింటి పెత్తనమంతా యిప్పుడు యెవరిమీద
సాగుతుందో ?

కుమా: ఇంకెవరున్నారు ? మీ ప్రియమైన సన్! అంటే
మీ డియరెస్టు కుమార రత్నం శ్రీశ్రీశ్రీ రాజాగారు

రంగా: ఇకముందు మన పనులు నెరవేరే విధం ?

కుమా: ఏమండీ, ఈ సంవత్సరం పంటంతా మనమే సరి
పుచ్చుకున్నాముగా! మిగతా కిచ్చిన భూమి మనం
చేజిక్కించుకోవటం, తప్పుడు లెక్కలు చూపించి
మొత్తంమీద బకాయి మూడువందల బస్తాల ధాన్యం
బాకీ వుందని, అది తీర్చుకోటానికి రెండు మూడు
రోజులు గడువిస్తున్నామని వార్నింగ్ యిద్దాం!

వీర: ఆ సీనుగాడు బాకీ లేదని, తీరిపోయిందనిడబాయిస్తే?

కుమా: మనమే అంత తేలిగ్గా వున్నామా? సాక్ష్యం
కావాలంటే చెప్పను రామయ్యను అడగమందాం!

రంగా: సరే, బాగుంది ఉపాయం. వీరయ్యా నువ్వెళ్ళి
యీ రోజునే హెచ్చరించి రా.

వీర: చిత్తం. (వెళ్తాడు)

కుమా: (రంగరావు దగ్గిరగా వచ్చి చేతులు నలుపుకుంటూ)
ఏమండీ, యిక్కడికే సగానికి పైగా పనులు పూర్తయి
నాయి. కాబట్టి నే నొక్క ఉపాయం చెప్తాను. మీరు
అంగీకరిస్తారా?

రంగా: నువ్వు చెప్పిందేది కాదన్నాను చెప్పు?

కుమా: అహాఁ ఏమి లేదూ... రాను రాను రోజులు దొర్లి
పోతున్నై. నే ననుకున్న ప్రకారం నా పిక్చర్నియీ
పాటికి పూర్తి చేసి రిలీజ్ చెయ్యాల్సింది నాన్‌సెన్స్
ఏం జేస్తాం? మన రోజులలా వున్నయ్. ఏ పనీ
పూర్తికా లేదు. అందుకు......

రంగా: అందుకు?

కుమా: ఈవేళ చాలా మంచిరోజు అందుకు నాలుగు పత్రికలకు అడ్వర్‌టైజ్‌మెంట్లు పంపుదాం.

రంగా: నీ యిష్టమొచ్చినట్లే కానియ్! పిక్చర్‌కి పెట్టుబడి నేనే యిస్తానన్నానుగా! అందుకు నువ్వేమీ సందేహించవద్దు. నీ ప్రయత్నాలు నువ్వు కానియ్. అందుకు ప్రస్తుతం డబ్బేమైనా కావాలంటే, మన ఖజానాలో తీసుకుని ఖర్చు రాస్తాండు.

కుమా: అలాగే. మీరామాత్రం హామీ యివ్వాలేగాని రేపీపాటికి పిక్చర్ పూర్తిచెయ్యనూ.

రాజా: (బయటనుంచి) ఎవరండీ లోపల?

కుమా: మనుషులే.

రాజా: (బయటనుంచి) జమీందారుగారున్నారా అండీ?

కుమా: వున్నారు రండి.

రాజా: (వస్తాడు) నమస్కారమండీ.

రంగా: (వ్యంగ్యంగా) తమరా! ఎందుకొచ్చినట్లు?

రాజా: పేదరైతుల తరఫున వచ్చాను.

కుమా: ఏమిటీ విషయం?

రాజా: నీ కెందుకురా శ్రమ!

కుమా: శ్రమనుకుంటే ఎలా? సవినయంగా సమాధానపరచుకోవలసిన బాధ్యత నా మీదుంది. యీ జబాకి సర్వాధికారిని గనుక.

రాజా: అలాగా! ఘనమైనవారే! అయినా మీ పదవులతో మాకు పనేముందిలెండి. ఇప్పుడు నేనుచెప్పేదేమంటే

....పేదరైతులంతా ఏకమయ్యారు. వాళ్ళ కష్టసుఖాలు ఆలోచించవలసిన బాధ్యత మీమీదుంది. క్రిందటేడు తుఫానువల్ల బకాయి ధాన్యం చాలా మిగిలిపోయింది. అంతాకలిసి యీయేడు తీరుద్దామా అంటే అకస్మాత్తుగా వర్షాలవల్ల పంటలుదెబ్బతిన్నై. యీవిషయం మీకందరకు తెలిసిందేగా. అందుకు...

రంగా: అందుకు?

రాజా: క్రిందటి బకాయిలు పూర్తిగా రద్దు చేయమని వాళ్ళందరి తరఫున నేను కోరుతున్నాను.

కుమా: అలా వీల్లేదు. ఇక్కడికే ఖజానా అంతా ఖాళీగా వుంది. యీ పరిస్థితుల్లో నువ్వు కోరినట్లు చేస్తే జమీ అంతా అప్పులపాలౌతుంది కాబట్టి మీ కోర్కెలు నెరవేర్చటానికి వీలుపడదు.

రంగా: అవును, అంతే.

రాజా: బాగా ఆలోచించుకోండి. యిక్కడికే మీమీద అంతా కత్తిగట్టారు కేవలం మీమీదుండే ప్రేమవల్ల ముందుగా వచ్చి బతిమలాడుకోవలసివచ్చింది. రామయ్యకు మీరు చేసిన ద్రోహాన్ని గూర్చి ప్రతి రైతు గుండే అగ్ని గుండంలాగా మండిపోతోంది. వాళ్ళకోర్కె నెరవేర్చి సవినయంగా కలిసిమెలిసి వుండకపోతే విప్లవంతప్పదు. జమీందారుకీ రైతులకు మధ్య పెద్ద యుద్ధం ప్రారంభమౌతుంది. అది మీ వినాశనానికే కారణమౌతుంది.

రంగా: నోర్మూయ్!

రాజా: పెద్దవారు అన్నా ఫరవాలేదు. అయినా మాటనటం తేలికే, ఆచరించటం కష్టం.

కుమా: వాళ్ళ బకాయిలు రద్దు చేయకపోతే విప్లవం తప్ప దంటావ్!

రాజా: అనే మంచిగా చెప్పి వప్పిద్దామని వచ్చాను.

కుమా: వచ్చినందుకు సమాధాన మిచ్చారుగా....యిహ దయ చెయ్యొచ్చు.

రాజా: ఆఖరిసారిగా చెప్తున్నాను ఆలోచించటం మంచిదని మరోసారి చెప్తున్నాను.

రంగా: ఈవిషయంలో ఆలోచించాల్సిన పనిలేదు దయ చెయ్! (లోనికి వెళ్తాడు)

రాజా: సరే, సెలవ్! (వెళ్ళబోతాడు)

కుమా: ఆగు.

రాజా: (ఆగి) ఎందుకు?

కుమా: ఈ విప్లవంలో ప్రధాన పాత్ర ఎవరిది?

రాజా: ఏం? మీ పిక్చర్లో హీరోగా బుక్ చేస్తారా?

కుమా: ఎగతాళిగా వుందా?

రాజా: ఎగతాళిగా మాట్లాడేవాళ్ళకు ఎగతాళిగానే కన్పిస్తుంది.

కుమా: అందుకే మన బ్రతుకలాగయింది!

రాజా: నా బ్రతుకేం! నీ బ్రతుకు తెరు వాలోచించుకో!

కుమా: నా బ్రతుకేం బ్రహ్మాండంగా వుంది.

రాజా: వుంటుంది. యింకా నాలుగురోజులు పోతే ఎలా వుండేదీ తెలుస్తుంది.

కుమా: తరువాత మాత్రమేం?

రాజా: మన ముఖం కుక్కలు కూడా చూడవ్.

కుమా: ఆఁ ఎవరి ముఖం చూడందీ తెలుస్తూనే వుంది.

రాజా: మాకేం? కష్టించి పనిచేసే వాళ్ళు! ప్రపంచంలో ఎప్పుడూ తావుంటుంది. నీలా బేవార్సు బ్రతుకు బ్రతకటం లేదు, నీకుమల్లే ఒకళ్ళ కొంప ముంచటం లేదు.

కుమా: (కోపంగా) ఎవరూ కొంప ముంచేది?

రాజా: నువ్వు జమీందారు పంచ జేరబట్టే యిలా దుర్వ్యసనాలకు లోనయ్యాడు! ఆయన జమీ అంతా అప్పుల పాలేశావ్! ఆయన జీవితం నాశనం చేశావ్!

కుమా: (ఆవేశంతో) నోర్మూయ్! (అంటూ చెయ్యి ఎత్తి కొట్టబోయడు. ఆ చేతిని రాజా పట్టుకొని వెంటనే మెలి త్రిప్పుతాడు)

రాజా: ఏం? ఏం కుమార్. ఏమయ్యింది నీ ప్రతాపం. హుఁ! నా మాటలు విన్నావ్, అవమానం భరించలేకపోయావ్, ఆవేశానికి లోనయ్యావ్ కదూ? ఎంత ధైర్యం. కష్టజీవుల కష్టసుఖాలు లెక్కించక పేదజీవుల రక్తంపీల్చే జలగ ఆ జమీందారు. ఆయన ఆడే ఆటలకు తాళం వేసే శాకట్లమారి వెధవ్వు నువ్వు. నిన్ను చూస్తేనే అసహ్యం వేస్తోంది. నీ పరివర్తన కింకునే ప్రతీకారంగా నీ ప్రాణంతీసినా

మా పగ చల్లారదు. నన్ను పరాభవించటానికి సాహసించిన నీ చెయ్యిని యిప్పుడే విరిచేస్తాను. (అంటూ చేతిని యింకా మెలి త్రిప్పుతాడు)

కుమా: అమ్మో! చచ్చిపోతున్నాను బాబో! (అంటూ పిచ్చికేక పెడ్తాడు)

రాజా: (నవ్వి) వెఱ్రివాడా. నీ ప్రాణమంటే నీకెంత తీపో ప్రాణమున్న ప్రతి జీవికీ అంతేనని మరువకు. ఎవ్వరినీ దూషించకు. యింకెవ్వరికీ హాని చేయకు. తోటి మానవుడవని దయదల్చి వదిలేస్తున్నా. లేకపోతే నీవు చేస్తున్న విద్రోహాలకి కఠినంగా శిక్షించినా రక్షించే దిక్కుమాత్రం లేదని మరువకు! పశువులాగా సంచరించక నీతి నియమాలు తెల్సుకుని నిర్జీవంలా జీవించు. మీ బ్రతుకులు బయటపడే రోజు లొచ్చినై జాగ్రత్త! బయటకు వెడతాడు. కుమార్ అటే నిర్జీవిలా చూస్తుంటాడు. జమీందారు వచ్చి కూర్చుంటాడు.)

రంగా: ఏడీ! (బిగ్గరగా) కుమార్, రాజా యేడీ?

కుమా: (రెండవ కేకను తేరుకుని) ప ప ప పారిపోయాడు.

రంగా: ఏమన్నాడు?

కుమా: (సకిలించి) పిచ్చిపిచ్చిగా వేల్తుంటే పళ్లు రాలేటట్లు కొట్టాను.

రంగా: (ఆదుర్దాగా) కొట్టావా?

కుమా: ఏం?

రంగా: ఏమీ లేదు. (వీధి వైపు శూన్యంలోకి చూస్తూ) ఎంతలో యెలా మారిపోయాడు!

కుమా: ఎవరూ?

రంగా: (వీధివైపే అయోమయంగా చూస్తూ పెద్దగా) రాజా!

కుమా: (భయంతో రాజా వస్తున్నాడేమోనని వణికిపోతూ వీధివైపు భయంగా చూస్తూ) ఆఁ!

రంగా: ఏమిటలా భయపడుతున్నావ్?

కుమా: ఆఁ! (గుటకలు మింగుతూ) ఏమీ లేదు.

రంగా: ఏం చెప్పాడు?

కుమా: ఏం చెప్తాడు? మనం చేసే అన్యాయాలు, అక్రమాలు మార్చుకోవాలట. లేకపోతే మన బ్రతుకులే బయటపడే రోజులువస్తున్నాయట.

రంగా: ఏడ్చారు! గంజికికూడా గతిలేని వెధవలంతా మన బ్రతుకుల్ని విమర్శించటమే.

వీర : (తలమీంచి రక్తం కారుతూంటుంది. చేతిలోకర్రతో పరిగెత్తి వస్తాడు) వెధవ! దొంగదెబ్బ కొట్టాడు. లేకపోతే వాడిబ్రతుకో నా బ్రతుకో తేలేది.

రంగా: ఏమిటది?

కుమా: ఏం జరిగింది?

వీర : ఆ వెధవ ఆరోజునసే పసిగట్టాడు.

రంగా: ఎవరు?

వీర : ఇంకెవరు? ఆ సీనుగాడు.

కుమా: ఇప్పుడెందు కొట్టాడు?

వీర : ఏం చేస్తున్నారో నని యింటి వెనకాల పొంచిచూస్తు న్నాను. ఈ యిల్లుకూడా అంటిస్తున్నా ననుకున్నా డేమో వెనకాలేవచ్చి కొట్టాడు ఎదురుగావస్తే వాడి తడాకా నా తడాకా తేలేది.

రంగా: నువ్వెళ్ళి ముందు డాక్టర్ దగ్గర కట్టు కట్టించుకో. మిగతా వ్యవహారాలు నేను చూచుకుంటాను

(వీరయ్య బయటకు వెళ్ళాడు)

కుమా: వ్యవహారం చాలా ముదిరింది. ఇవ్వాళ వాడిమీద చెయ్యిచేసుకున్నవాడు రేపు మనమీద చేసుకోడని నమ్మకమేమిటి?

రంగా: అందుకు యేం చెయ్యాలంటావ్?

కుమా: తగిన కట్టుదిట్టం చెయ్యకపోతే మన ఆటలు సాగవ్! అందుకు...

రంగా: అందుకు?

కుమా: సిపాయిలను తీసుకువచ్చి కాపలా పెడ్దాం!

రంగా: అవును. మంచి ఆలోచన.

కుమా: దానికి డబ్బు చాలా అవసరం.

రంగా: తాళంచేతులు నీ వద్దే వున్నైగా! ఖజానాలో యెంతుంది?

కుమా: షుమారు ఎనిమిదిలక్షలున్నై అనుకుంటా!

రంగా: ఆఁ! ఎనిమిదేనా?

కుమా: అవును.

రంగా: ఎందుకని?

కుమా: ఖర్చవ్వటంలం?

రంగా: దేనికి?

కుమా: దేని కేమిటి! మన ఇరువురి దర్శాలకూ, నా పిక్చర్ అడ్వర్టైజ్‌మెంట్లకూ, తదితర ఖర్చులకూ అవుతూనే వున్నై.

రంగా: అంత అజాగ్రత్తగా ఖర్చు చేస్తే ఎలా?

కుమా: అజాగ్రత్తా! అయిందీ! నే నెంత జాగ్రత్తగా ఖర్చు పెడ్తున్నా అనవలసిన మాటకూడా అననే అన్నారు.

రంగా: సరే అయితే దాన్ని గూర్చి ఆలోచించటమెందుకూ? ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు ఖర్చు చేసిందీ వెంటనే లెక్కలు వ్రాసి యివ్వు ఖజానా తాళం చేతులు కూడా నా చేతికే యివ్వు. (లోనికి వెళ్తాడు)

కుమా: సరే! యిస్తాను, ఎలాగైతేనే యిచ్చావు జీతంబత్తెం లేని వుద్యోగం! నా విలాగే అనుమానించావ్! సరే చెయ్యవలసిన వ్యవహారమేదో చేస్తేనేకాని తిక్క కుదరదు. హుం! కుమార్ అంటే ఏమిటో అనుకున్నావ్! నీ లాంటి చవటల జీవితాలెన్నో నాశనం చేశాను. నా యిష్ట ప్రకారం నడుస్తున్నావని యిన్నాళ్లూ మంచిగా సంచరించాను. లేకపోతే నీ జమీకి నీకూ లంగడే బుణం తీరేది. యిప్పుడు నీకు

దిక్కేవడో చూస్తాను. (కోపంగా చూస్తూ బయటకు వెళ్ళి పోతాడు)

రంగా: (లోనినుంచి వచ్చి) లెఖ్ఖ తయారు చేశావా?

కుమా: యింకా లేదు.

రంగా: ఎందుకని?

కుమా: వేరే పనుండి వెళ్తున్నాను. వచ్చిం తరువాత వీలైతే వ్రాసి యిస్తాను. (బయటకు వెళ్తాడు)

రంగా: (ఆ వైపే ఆశ్చర్యంగా చూస్తుంటాడు. లోనినుంచి "అంతరాత్మ" ఘోష వినిపిస్తుంది.)

అంత: (నవ్వు)

రంగా: ఆఁ!

అంత: (వికటంగా నవ్వు)

రంగా: ఏమిటది? ఎక్కడ? ఎందుకలా నవ్వుతావ్? ఎవరు నువ్వు?

అంత: మీ యింట్లోవున్న నిలువుటద్దంవైపు చూడు!

రంగా: (లోనికి చూస్తుంటాడు)

అంత: నేనెవరైంది యిప్పుడు నీకు చెప్పినా అర్థంకాదేమో!

రంగా: అంటే?

అంత: నిన్ను చూస్తే నేంజాలేస్తుంది!

రంగా: ఎందుకు?

అంత: నీ అజ్ఞానానికి కాదు, నీ అమాయకత్వానికి!

రంగా: నేను అమాయకుణ్ణా? నాలో అజ్ఞానముందా?

అంత : జ్ఞానం కలవాడివైతే అజ్ఞానంగా యెందుకు ప్రవర్తిస్తావ్?

రంగా: యింతకీ యెవరు నువ్వు?

అంత : (నవ్వు)

రంగా: మాట్లాడవేం?

అంత : (వికటపు నవ్వు)

రంగా: నిన్నే, పలకవేం?

అంత : (వెర్రినవ్వు)

రంగా: ఆఁ! (టేబిల్ మీదున్న పూలకూజా లోనికి విసురుతాడు. లోనినుంచి అద్దం పగిలిన చప్పుడౌతుంది ఆ వైపే అయోమయంగా చూస్తుంటాడు)

అంత : (నవ్వి) పిచ్చివాడా! ఇప్పుడు నువ్వు పగలగొట్టింది ప్రాణంలేని గాజుపలకని కాదు! అమృతోపమానమైన నిష్కృదయాన్ని నువ్వే పటాపంచలు చేసుకున్నావ్! నీచుడా! నువ్వు చేసే నీచపుపనులు సహించలేకే నీలోనుండి వేరయ్యాను. ఆకారానికి మనిషిమాత్రం మిగిలావ్! అంతే, దుర్మార్గుడా!

రంగా: ఆఁ! నే నెవ్వరికి దుర్మార్గం చేశాను?

అంత : ఎవ్వరికీ చెయ్యలేదూ?

రంగా: లేదు.

అంత : అని అంటే సరిపోతుందా! అందరూ అంగీకరించొద్దూ! నీకోసం అష్టకష్టాలు పడి చెమటోడ్చి పని చేసే రామయ్య జీవితం నాశనం చేశావ్! కొడుకనే కరుణకూడా లేకుండా, నీ నీచపుబుద్ధిని ఎంతమీద

ప్రయోగించి ఆయిరువురి ప్రేమలతను త్రుంచివెయ్యాలని చూశావ్! ఎందుకూపనికిరాని పోరంబోకు వెధవ కుమార్‌ని నమ్మావ్! అతడు నిన్ను వుద్ధరిస్తాడనుకున్నావ్! నీ జమీని వృద్ధిచేస్తాడని కలలు గన్నావ్! పాముకి పాలుపోసి పెంచితే యేమవుతుంది? అదే జరిగింది. అతడు నీకే ద్రోహం చేయ తలపెట్టాడు. నీ ఆస్థంతా తానే వశపరచుకోవాలని చూస్తున్నాడు. ఇక్కడికే సగానికి పైగా నీ ఆస్థి నాశనం చేశాడు. ఇప్పటికైనా కళ్ళు తెరచి ప్రవర్తించు. లేదా? నీ జమీ నువ్వూ అంతా నాశనమౌతారు. ఆలస్యం చేస్తే అమృతంకూడా విషమౌతుంది. లే! వెళ్ళు!! వెళ్ళూ!!!

రంగా: (తేరుకుని) ఆఁ! వెళ్తున్నా! ఈరోజే కుమార్ గాణ్ణి ఉద్యోగంనుంచి వూడదీస్తా! రామయ్య ఆత్మ శాంతికిగాను నా రాజాను లతకిచ్చి వివాహం చేస్తాను నా జమీ అంతా వాళ్ళ స్వాధీనం చేసి హాయిగా జీవిస్తాను. ఇదే నా అంతిమ నిశ్చయం! వెళ్తూన్నా! (లోనికి వెళ్తాడు)

(తెర)

6 వ రంగము

[తెర లేచేసరికి సమయం రాత్రి షుమారు గం॥ 7-30. జమీందారుగారి బంగళా. మూడవ సీనుమాదిరే పరికరములు అమర్చవలెను. టేబుల్ లైట్ వెలుగుతూంటుంది. కుమార్ సిగరెట్ కాలుస్తూ చేతిలోవున్న ఖైజాకువంక చూస్తూ ఆలోచిస్తుంటాడు.]

వీర : (బయటనుంచి వచ్చి) బాబూ! ఏమిటి ఆలోచిస్తున్నారు?

కుమా: ఏమీలేదు. సరేకాని వూళ్ళోగొడవ ఎలాగున్నై?

వీర : ఎలాగుంట మేమిటండీ! రాజాగారు మనమీద పగబట్టారు. రేపో మాపో మనమీద దాడిచేయటానికి సన్నాహాలు జరుపుతున్నారు.

కుమా: ఎందుకు?

వీర : వాళ్ళ కోర్కెలు కాదన్నందుకు.

కుమా: (ఆలోచించి) అయితే మన జమీలో గందరగోళం తప్పదన్నమాట. దేనికైనా ముందుజాగ్రత్త మంచిది కదూ?

వీర : ఏ విషయంలో?

కుమా: చెప్తాను వుండూ, తొందరపడితే యెలా? ఇప్పుడు నువ్వు నాతో సహకరించాలి. చెప్పినపనల్లా అక్షరం పొల్లుపోకుండా చేస్తానని ప్రమాణాం చెయ్యాలి.

వీర : ఓ! దానికేముండీ! మీారు చెప్పిన మాట విని కొద న్నాను!

కుమా: అయితే ప్రమాణం చెయ్యి. (చెయ్యి జాపుతాడు)

వీర : (చేతిలో చెయ్యివేసి ప్రమాణం చేస్తాడు)

కుమా: ఇలా కూర్చో. (అంటూ సోఫా చూపుతాడు)

వీర : ఫరవాలేదులెండి ఇక్కడే కూర్చుంటాను. (అంటూ క్రింద కూర్చుంటాడు)

కుమా: (అటూ యిటూ చూచి రహస్యంగా) ఇప్పుడు మనం యీ ముసలాడిమీాద దయ తలిస్తే చిల్లికాసీ కూడా మనకు దక్కదు. రైతులు దాడిచేస్తే అంతా వాళ్ళ పరమైపోతుంది.

వీర : ఏం చేద్దామంటారు?

కుమా: ఆస్తంతా నాపేర వ్రాయమని బలవంతం చేసి కార్యం నెరవేర్చుకుందాం. లేదా ప్రాణం తీస్తామని బెద రిద్దాం! ఆ ఆస్తంతా నేను తీయబోయే పిక్చర్‌కి పెట్టు బడి పెట్టి సగభాగం నీకిస్తాను యేమంటావ్?

వీర : నేనేమంటాను బాబూ! మీారు యేం చెప్పినా చెయ్య టానికి సిద్ధంగా వున్నాను.

కుమా: సరే! జమీాందారుగార్ని నేను పిల్చి మాట్లాడు తాను. నువ్వు బయట నిలబడి యెవ్వరొచ్చినాసరే లోనికి రానివ్వబోకు

వీర : అలాగే! (బయటకు వెళ్తాడు)

కుమా: (ఖైజారు జేబులో దాచి లోపలికి చూస్తూ) రంగా రావుగారూ! రంగారావుగారూ!

రంగా: ఆc!.(లోనినుంచి వస్తాడు) ఏం! లెక్కలు వ్రాశావా!

కుమా: తరువాత వ్రాసి యిస్తాను.

రంగా: ఏం?

కుమా: మీతో కొద్దిగా మాట్లాడాల్సిన అవసరముండి వ్రాయ లేదు.

రంగా: ఏమిటది? (అంటూ కూర్చుంటాడు)

కుమా: ఏముందీ.........వూళ్ళో వాతావరణం యేమీ బాగుండలేదు.

రంగా: ఎందుకనీ?

కుమా: మీ రాజా రైతుల్లో జేరి విప్లవం లేవదీస్తున్నాడు. వాళ్ళు రేపో మాపో మన బంగళామీద పడి మన జమీ అంతా వాళ్లు స్వాధీనపరుచుకోవాలని చూస్తు న్నారు.

రంగా: సరే! అలా అయితే తగిన జాగ్రత్త తీసుకోటానికి ప్రయత్నిస్తాను. నువ్వు మాత్రం వెంటనే లెక్కలు వ్రాసి యివ్వు

కుమా: అదొంతపని లెండి! ఇంకో చిన్న విషయంకూడా చెప్పదలుచుకున్నాను. ఏమంటే ఆస్థి మీ పేరు నుంటే రాజాద్వారా తప్పక రైతుల వశమౌతుంది. అందుకు...

రంగా: అందుకు?

కుమా: మీరు నమ్మిన ఒక వ్యక్తి చేతుల్లో .. అహా...
నామకా పెడితే మిమ్మల్ని, మీ జమీని ఎవరూ
ఏమీ చెయ్యలేరు.

రంగా: యిప్పుడెవ్వరున్నారు?

కుమా: ఎవ్వరూ లేరా!

రంగా: లేరు.

కుమా: పోనీ నన్ను ఏవిధంగా చూస్తున్నారు?

రంగా: యింతవరకూ నమ్మాను కాబట్టే స్వంత పుత్రుని
కంటే ఎక్కువగా గౌరవంగా చూసుకుంటున్నాను.

కుమా: యిక ముందు!

రంగా: నీకూ నాకూ ఏమీ సంబంధం లేదు. యీ రోజు
నుండి ఎవరి దారి వాళ్ళదే.

కుమా: అయితే సరే, ఆస్థి నా పేరున రాయటం విషయం
ఏమాలోచించారు?

రంగా: నా ప్రాణముండగా ఆపని జరగదు.

కుమా: బాగా ఆలోచించి చెప్పండి.

రంగా: దీన్ని గూర్చి ఆలోచించాల్సిన పని లేదు.

కుమా: అయితే నాపేరన ఆస్థి రాయరన్నమాట!

రంగా: అది కలలో వార్త.

కుమా: యీ కాగితం ఒక్కసారి చదువుకోండి! (జేబులో నుంచి కాగితం తీసి యిస్తాడు)

రంగా: (కాగితం అందుకుని చదువుతూంటాడు)

కుమా: ఇంతవరకూ మీ జమీమీద సర్వాధికారాలు చెలాయించటానికి అంగీకరించారు. యీ విషయం కూడా అంగీకరించి మీ యావదాస్థిని నా చేతిలో పెట్టండి.

రంగా: దుర్మార్గుడా! ఇదా నీ కుట్ర!

కుమా: కుట్ర కాదు, బ్రతుకు తెరువు.

రంగా: ఛీ! నోరుముయ్!

కుమా. మాటలు మిగుత్తే మరణం తప్పదు. జాగ్రత్త.

(జేబులోనుంచి ఖైజార్ తీసి చూపుతాడు)

రంగా: (భయంగా) ఆఁ ఖైజార్!

కుమా: అవును, ఖంగారు లేదు.

రంగా: (తడబడుతూ) ఖ...ఖ...ఖంగారు లేదు. కాని ఆ ఖైజార్ ఎందుకు?

కుమా: కార్యం సాధించటానికి కావల్సొచ్చింది కాబట్టి.

రంగా: ఏమిటా కార్యం?

కుమా: నీ ఆస్థి నా వశం కావాలి. అందుకు ఆ కాగితం మీద తమరు సంతకం చెయ్యాలి.

రంగా: ఆపని నేను చెయ్యలేను.

కుమా: చెయ్యక తప్పదు.

రంగా: ప్రాణం పోయినా సరే, నాఆస్థి నీ వశం కావటానికి వీలులేదు.

కుమా: ముచ్చటగా చెప్తే మాట వినేటట్లు లేదు. (ఖైజార్ గురి చూపి) ఏమంటావ్?

రంగా: (ఏమీ తోచక ఖైజార్ వంకే ఆశ్చర్యంగా చూస్తుంటాడు.)

(తెరలో నాల్గవ రంగంలోని కోరస్ వినిపిస్తుంది)

రంగా: (భయంగా) ఏమిటది?

కుమా: భయంలేదు! మీ రాజా అండ్ పార్టీ మన జమీ మీదకు దోపిడీకి బయలుదేరారు.

రంగా: ముందు తలుపులు వేసి వస్తాను. (వెళ్ళబోతాడు.)

కుమా: ఇక్కడికె వ్వరూ రారు. నీ కార్యం ముందు కానివ్వు.

రంగా: ప్రస్తుతం ఆపని జరగటమనేది కలలో వార్త.

కుమా: ఆపనే జరగని పక్షంలో నీ ప్రాణాలు దక్కవ్!

రంగా: ప్రాణం తీసినా పచులు మాత్రం నెరవేర్చుకోలేవు, దుర్మార్గుడా!

కుమా: ఆఁ! (కత్తితో డొక్కలో పొడుస్తాడు)

రంగ: (కెవ్వున కేక వేసి క్రింద పడిపోయి బాధతో కొట్టు కుంటాడు)

(తెర లో)

రాజా: దారి కడ్డంలే.

వీర : లేవడానికి వీలు లేదు.

రాజా: కారణం?

వీర : లోనికి వెళ్ళడానికి వీలు లేదు.

[రంగస్థలం మీద]

కుమా: (గాబరాగా అటూ యిటూ పరుగెత్తుతూ రైతులంతా లోనికి వస్తారేమోనని భయపడుతూంటాడు)

రంగా: (బాధగా పాకుతూ డెస్కు దగ్గరకు వెళ్ళి లోని నుంచి పిస్టల్ తీసి కుమార్‌ని కాల్చి పడిపోయి ప్రాణాలు విడుస్తాడు)

కుమా: అబ్బా! (బాధగా నేలకొరిగి ప్రాణాలు విడుస్తాడు)

[తెర లో]

అందరు : లోపలేదో గొడవ జరుగుతున్నట్టుంది. పదండి!

వీర : నేను వెళ్ళనివ్వను.

అందరు : నువ్వు వెళ్ళనిచ్చే దేమిటీ ! పదండి ! (అంటూ లతా, రాజా, సీనూ త్రోసుకుని లోనికి వస్తారు ఆ రెండు శవాలను చూసి లత 'బావా', రాజా 'నాన్నా' అంటూ దగ్గరగా వెళ్ళి కూర్చుని విచారి స్తుంటారు)

[తెర లో పా ట]

ఓ ధనికుడా ! ఆహుతై పోతివా !
కపటి మాటలకు కుట్రదారులకు
కనికరము చూపి క్రుంగిపోతివా ! ||క||

పేదల రక్తం పిండిన నీకు
కఠిన మరణమే ఖాయం కానా
ఇదేనా లోకం, ఇదా ధనిక లోకం
ఇదా భరత భూమిరా ! ! !

లత : ఇంత దారుణానికి కారణం ఎవరై యుంటారు ?

సీను : గుమాస్తాని కడ్డంగా నుంచున్న ఎవవే ఐయుంటాడు ఆడి పాణం తీస్తాను (వెళ్ళబోతాడు)

రాజా : (సీనును ఆపుచేసి) వాడిదేం తప్పులేదు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? నాయందే కఠినంగా సంచరించినప్పుడు కాసేకోసం కూలి చేసుకునేవాడు వాళ్ళు చెప్పింది చెయ్యొద్దూ !

లత : అదీ యదార్థమే! (లేచి నిలబడి) జమీందారుగారూ సెలవిప్పిస్తారా !

రాజా : లతా ! పరిహాసంగా వుందా ?

లత : ఇందులో పరిహాస మేముందీ ! ప్రస్తుతం మీరు ఒక జమీందారు ! మీలాంటి వారికి మావంటి కూలి కుంకలు కన్పిస్తారా !

రాజా : పొరపాటు లతా ! యీ జమీ అంతా...

సీను : మీ బాబుగారిది. ఇప్పుడు మీదయింది కదండీ !

రాజా : కాదు ! దీనిలోని ప్రతి అంగుళం పేద రైతులను పీడించిపిండిన రక్తబిందువుల మయం! అందుకే యీ భవనం, యీ జమీ, అంతా నాది కాదు. ఇందులో ప్రతి వ్యక్తికీ సంబంధ మున్నది. ఇకనుండి మగతాకు తీసుకున్న భూములు "దున్నేవాడిదే భూమి" అన్న సిద్ధాంతం ప్రకారం అందరికీ అందజేస్తున్నాను. ఎవరు సాగుచేసుకునే భూములు వాళ్ళవే ! ఇందుకు అందరూ అంగీకరించి ఆనందిస్తారనినమ్ముతున్నాను. "దున్నేవాడిదే భూమి." "రైతు భూమికీ"

అందరు : జై !

రాజా : రైతు రాజ్యానికీ

అందరు : జై !

రాజా : రైతు రాష్ట్రానికీ

అందరు : జై !

[అందరూ వరుసగా నిలబడి కోరస్ పాడతారు]

లే లెండోయ్ రా రండోయ్
కార్మిక కర్షక యోధుల్లారా
రయమున లేచి రారండోయ్ ॥లే॥

ఎండి మండే గుండెల్లోంచి
స్రవించుతోంది చిక్కని రక్తం
వినిపిస్తోంది ఆర్తాలాపం ॥లే॥

రైతు రాజ్యమే ప్రజారాజ్యమని
ప్రపంచమంతా ప్రబోధింపగా
రైతు భూమని ఢంకా గొట్టగ
రయమున ముందడు గేయండోయ్
రా రండోయ్! లే లెండోయ్! రా రండోయ్!

(వరుసగా లోనికి వెళ్తుంటారు.)

[తెర]

** సమాప్తి **

ముద్రణ : "వెంకటరత్నా ప్రింటర్స్"

1016

RYTU BHUMI	**PRICE:**
BY B. N. SURI	Rs. 2-00

మా స్వంత ప్రచురణలు :

శైవలిని	బంకింబాబు	3-75
విధిబలీయం	యజ్ఞన్న	1-50
ఎవరుత్యాగి	,,	2-00
హారితాత	ప్రేమేంద్రనాథ్ మైత్రి	2-25
టాగూరు తాతయ్య	ఆవంచ	1-50
ఆరోజులురావు	వి॥ సరోజినీదేవి	8-50
అర్ధాంగి	రమణలాల్ దేశాయి	6-00
భూమాత కన్నీరు	త్రిపాఠీ	5-50
మంచి అలవాట్లు	కె. రమేశ్	1-00
వీరహనుమాన్	,,	1-00
కల చెదిరిపోనీకు నేస్తం	విశ్వం	2-50
న్యాయాధికారి	ఠాకూరు	1-00
కోతలరాయుడు	సుంకర	2-00
కన్నబిడ్డ	బి. యన్. సూరి	2-[illegible]0
అలెగ్జాండర్	తిపిర్నేని	2-00
శకుంతల	తాండ్ర	2-00
దొరికితే పట్టుకున్నాం		1-[illegible]0

★